Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 91 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6, మే, 2024 మంగళవారం పేజీలు : 4

## రాహుల్ గాంధీలో సత్తా లేదు: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలో సత్తా లేదని, అయితే ఆయన పార్టీ హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ఆయన పీటీఐతో శనివారం మాట్లాడుతూ పలు అంశాలపై చర్చించారు. ఎన్డీయే కూటమి 400కు పైగా సీట్లు సాధిస్తుందని, బీజేపీ 370కి పైగా సీట్లు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్ర, తెలంగాణలోనూ మెరుగైన సంఖ్యలో సీట్లు గెలుస్తామన్నారు. తాము అధికారంలోకి వస్తే యూనిఫామ్ సివిల్ కోడ్, ఒకే దేశం.. ఒకే ఎన్నికపై ముందడుగు పడుతుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చడంగాని, రిజర్వేషన్లను రద్దు చేయడంగానీ బీజేపీ ఎప్పటికీ చేయబోదని స్పష్టం చేశారు.






# ఆ నలుగురిపైనే ఆశలు

## కెసిఆర్ బస్సు యాత్రతో బిఆర్‌యస్‌లో జోష్

## పార్టీ బలంతో పాటు అభ్యర్థి చరిష్మా

తెలంగాణ రాష్ట్రం లోని పదిహేడు లోక్ సభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలు బారతీయ రాష్ట్ర సమితికి జీవన్మరణ సమస్యగా మారింది శాసన సభ ఎన్నికల్లో ఓటమి పాలై అధికారం కోల్పోయిన కారు పార్టీ లోక్ సభ ఎన్నికల్లో ఎదురీదుతుంది ,అదికారం కోల్పోయిన తరువాత బి ఆర్ యస్ అనేక సమస్యలను ఎదురకుంటుంది ప్రదానంగా కొందరు నాయకులు పార్టీని వీడి వెళ్ళడం ,కల్వకుంట్ల కవిత లిక్కర్ కుంభకోణంలో జైలుకు వెళ్ళడం ,కాళేశ్వరం వివాదంగా మారడంతో ఆ పార్టీ తిరిగి పట్టు సాదిచేందుకు పార్ల మెంట్ ఎన్నికలు ఒక అవకాశం గాను ఒక పరీక్షగాను భావిస్తుంది, ఒంటరిగా పదిహేడు చోట్ల అభ్యర్థులను నిలిపిన కె సి ఆర్ బస్సు యాత్ర ద్వారా అన్ని నియోజక వర్గాలలో పర్యటించేందుకు ప్రణాళికా చేసుకుని ప్రచారంలో దూసుకు పోతున్నారు,ఇప్పటికే మహబూబ్నగర్ ,నల్గొండ ,వరంగల్ ,నాగరకర్నూల్,మహబూబాబాద్ ,భోనగిరి లో జరిగిన కెసిఆర్ రోడ్ షో లకు ఊహించని స్పందన వస్తుంది.ఇదిలా ఉంటే కాంగ్రెస్స్ – బిజెపి పార్టీలు ఇవి కేంద్ర ప్రభుత్వం కోసం జరిగే ఎన్నికలు కావున జాతీయ పార్టీలకే ఓటు వేయాలని ప్రచారం చేసుకుంటున్నవి మరోక సారి మోడి అని బిజెపి, మార్పు కోసం రాహుల్ అని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటున్నవి. తెలంగాణలో పుట్టిన పార్టీ బీఆర్ యస్ ను గెలిపించుకోవాలని గులాభి అధిపతి కోరుతున్నాడు. గ్రామీణ ప్రాంతంలో బీ ఆర్ యస్ కు కొంత సానుకూల వాతావరణం ఏర్పడుతుంది.కొన్ని సర్వేల ప్రకారం బి ఆర్ యస్ కి ఒక్కసీటు కూడా రాదని చెపినప్పటికి కెసిఆర్ పర్యటనలతో మార్పు చోటు చేసుకుంటుంది ముఖ్యంగా నాగర్ కర్నూల్ ,మెదక్ ,కరీంనగర్ ,మహబూబాబాద్ లలో కారు పార్టీ ఎంపి అభ్యర్తులు గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నవి, అధికార కాంగ్రెస్ పార్టీ ,బారతీయ జనతా పార్టీ నాయకత్వం గెలుపుకోసం తీవ్రప్రయత్నం చేస్తున్నా ఈ త్రిముఖ పోటీలో బిజెపికి అదిక స్థానాలు గెలిచే అవకాశాలు మెరుగు పడుతున్నవి అందుకు కాంగ్రెస్ తీసుకున నిర్ణయాలు కూడా కారణం కావచ్చు ఐదు నుండి ఆరు స్థానలల్లో బిజెపికి పోటీగా కాంగ్రెస్ సరైన అభ్యర్తులను పోటీలో పెట్టలేదు.అందుకు ఈ క్రింది ఉదాహరణలు గమనిస్తే అర్దం అవుతుంది మెదక్ లో బిజెపి నుండి మాజీ ఎమ్మెల్యే రఘునందన రావు బి ఆర్ యస్ నుండి వెంకటరామిరెడ్డి పోటీలో ఉండగా కాంగ్రెస్ నుండి మధుని పోటీలో పెట్టింది ఇక్కడ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి లేదా గీత రెడ్డికి ఇచ్చి ఉంటే అవకాశాలు వేరేలా ఉండేవి. బి ఆర్ యస్ కు కంచుకోట లాంటి మెదక్ లో కొంత రఘునందకి పట్టు ఉన్నది ఇక్కడ కాంగ్రెస్ బలహీన మైన అభ్యర్తీని నిలపడం మరియు మల్కాజి గిరి లో బి జె పి నుండి ఈటెల రాజేందర్ పోటీలో ఉండగా కాంగ్రెస్ సిట్టింగ్ స్తానం అయిన ఇక్కడ సునీత రెడ్డి ని నిలపడం రాజేందర్నీ గెలిపించడానికే అని ప్రచారం జరుగుతుంది ,లస్కర్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై బి ఆర్ యస్ పార్టీలో ఉండి ఎ మ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ లో చేరిన దానం నాగేద్ర ను పోటీలో పెట్టడంను స్వయాన కాంగ్రెస్ కార్యకర్తలే తప్పు పడుతునరు,కరీంనగర్లో బండి సంజయ్ పై పెద్దగా పేరు లేని వ్యక్తిని పోటీలో పెట్టడం బడే భాయి – చోట భాయి లకలయికకు సంకేతం అని ప్రజలు భావిస్తున్నారు.

**నాలుగు చోట్ల బి ఆర్ యస్ కు అవకాశం** : నాగర్ కర్నూల్ ,మెదక్, మహబూబాబాద్,మరియు కరీంనగర్ లో బి ఆర్ యస్ పార్టీ గెలుపుకు అవకాశాలు కనిపిస్తున్నవి.నాగర్ కర్నూల్ లో మాజీ ఐ పి యస్ అధికారి ఆర్ యస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ యస్ నుండి పోటీలో ఉన్నారు ఇక్కడ కాంగ్రెస్ తరుపున మల్లు రవి పోటీలో ఉండగా బాజపా నుండి భరత్ పోటీ చేస్తున్నారు ఇక్కడ ప్రధానంగా బి ఆర్ యస్ మరియు కాంగ్రెస్ పార్టీల మద్యలో పోటీ ఉన్నది అందులో ఆర్ యస్ ప్రవీణ్ కుమార్ కు ఉన్నపేరు బి ఆర్ యస్ బలంతో ప్రవీణ్ గెలిచే అవకాశం ఉన్నది. ప్రవీణ్ గురుకులాలో తీసుకు వచ్చిన మార్పు తో అనేక కుటుంభాలలో అభిమానులు ఉన్నారు మరియు తన స్వంత స్వేరో సైన్యం కూడా ప్రవీణ్ కోసం పనిచేస్తుంది ఎస్సీ రిజర్వ్ స్తానం అయిన ఇక్కడ ప్రవీణ్ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండడం కాలసివచ్చే అంశం ఇదిలా ఉంటే కెసిఆర్ ప్రచారం లో తాను అధికారం లో ఉన్నప్పుడు పాలమూరు జిల్లాకు చేసిన అభివృద్ధిని వివరించడం తో పాటు కాంగ్రెస్ ఇచ్చిన హామీల వైపల్యం పై ప్రజలకు వివరించిన తిరుతో స్తానికులలో బి ఆర్ యస్ పట్ల సానుకూలత ఏర్పడింది . మెదక్ లో పోటీలో ఉన్న బి ఆర్ యస్ అభ్యర్తి వెంకట్రామి రెడ్డి బిజెపి అభ్యర్తి రఘునందన్ ల మద్యనే పోటీ ఉండే అవకాశం ఉన్నది వెంకటరామిరెడ్డి గతం లో ఉమ్మడి మెదక్ జిల్లా మరియు సిద్దిపేట జల్లా కలక్టర్ గా పనిచేశాడు తరువాత ఉద్యోగాన్ని వదిలి బి ఆర్ యస్ లో చేరి రాజకీయ జీవితం ప్రారంబించాడు ప్రస్తుతం ఎమ్మెల్సీ గా ఉన్న వెంకటరామిరెడ్డి కి ఆర్తిక బలంతో పాటు రెడ్డి సామాజిక వర్గం బలంకూడా తోడుఅవుతుంది,మెదక్ లో బి ఆర్ యస్ కు బలమైన పునాదులు ఉన్నవి ఏడు ఎమ్మెల్యే స్తానాలకు గాను ఆరుగురు ఎమ్మెల్యే లు బి ఆర్ యస్ వాళ్ళే కావడం కలిసివస్తుంది.హరీష్ రావు మెదక్ లోక్ సభ కైవసం చేసుకోవాలని కసిగా పనిచేస్తున్నారు బలహీనమైన కాంగ్రెస్స్ అభ్యర్తి ఉండడంతో బిజెపి ఆశలు పెట్టుకుంది. కరీంనగర్ లో గులాబీ పార్టీ నాయకుడు వినో ద్ కుమార్ బోయినపల్లి కి బిజెపి బండి సంజయ్ కి మద్యనే పోటీ నెలకొని ఉన్నది వినోద్ కుమార్ ఇదే స్తానం నుండి గతంలో ఎంపి గా పనిచేశారు విద్యావంతుడు అయిన వినోద్ కుమార్ కి స్తానికంగా మంచి పేరున్నది. ఇక్కడ బండి ప్రస్తుత ఎంపి గత అసెంబ్లీ ఎన్నికలల్లో కరింనగర్ స్తానానికి పోటీ చేసి గంగుల కమలాకర్ చేతిలో ఓటమి చవి చూశారు. బండి మోడి నాయకత్వం మరియు రామలయా నిర్మాణం పైనే ఆశలు పెట్టుకున్నారు,వినోద్ కుమార్ పార్లమెంటుకు తగిన అభ్యర్తి అని విద్యావంతులల్లో అభిప్రాయం ఉన్నది. వినోద్ మొదటి నుండి కెసిఆర్ తోపాటుతెలంగాణ ఉద్యమంలో పనిచేశారు ఈ పార్లమెంట్ స్తానంలో బి ఆర్ యస్ కి ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్తి పేరు నామామాత్రమే కావడం తో మైనార్టీలు వినోద్ వైపు చూడడం కలిసి వస్తుంది .మహబూబాబాద్ లో ప్రస్తుత ఎంపి మాలోత్ కవిత రెండవ సారి గెలిచే అవకాశం కనిపిస్తుంది కాంగ్రెస్ అభ్యర్తి బలరాం నాయక్ ప్రజలకు అందుబాటులో ఉండడు అనే పేరు ఉన్నది కవిత తండ్రి రెడ్యా నాయక్, సత్యవతి రాథోడ్ సహకారం తో కవిత గెలిచే అవకాశం ఉన్నది,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల వైపల్యం వల్ల బి ఆర్ యస్ కి కొంత సాదారణ ప్రజాలల్లో ఆదరణ పెరుగుతున్నది , కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో అమలైన ఉచిత బస్సు పధకం ప్రజలపై ప్రభావం చూపలేక పోతుంది . రుణ మాపి ,రైతుబంధు ,తులం భంగారం,ఉద్యోగ ప్రకటనలు అమలు కాక పోవడం వల్ల కాంగ్రెస్స్ మోసం చేసింది అనే భావన ప్రజల్లో పెరుగుతుంది వీటికి తోడు కరువు కూడా కాంగ్రెస్స్ పై ప్రభావం చూపుతుంది ఏది ఏమైనా ఈ లోక్ సభ ఎన్నికలు బి ఆర్ యస్ పార్టీకి పరీక్ష లాంటివి .




## రైతులకు గుడ్ న్యూస్.. వారి అకౌంట్లలో నిధులు..

హైదరాబాద్, మే 05: తెలంగాణలో పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో పంట నష్టపోయిన బాధిత రైతులకు పంట నష్టం నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. ఈ మేరకు జీవో విడుదల చేసింది. పంట నష్టం నిధులు విడుదల చేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15,814 ఎకరాల్లో పంట నష్టం జరుగగా.. 15,246 మంది రైతులకు రూ. 15.81 కోట్ల నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. కాగా, రాష్ట్రంలో అత్యధికంగా కామారెడ్డిలో 10,000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది.




దిల్లీ: మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మళ్లీ చుక్కెదురైంది. బెయిల్ ఇచ్చేందుకు రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది. ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉన్న కవిత.. ఈడీ, సీబీఐ కేసుల్లో వేర్వేరుగా బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారంలో పాల్గొనాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు. మహిళగా పీఎంఎల్‌ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్‌కు అర్హత ఉందన్నారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన న్యాయస్థానం.. నేడు కవిత పిటిషన్లను తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల విచారణ సందర్భంగా కవితతో పాటు ఈడీ, సీబీఐ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కవితను అరెస్ట్ చేశారని ఆమె తరఫు న్యాయవాది వాదించారు. ఈడీ కస్టడీలో ఉండగా సీబీఐ అరెస్ట్ చేసిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భారాసకు కవిత స్టార్ క్యాంపెయినర్ అని చెప్పారు. ఆమెకు బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ, ఈడీ తరఫున న్యాయవాది న్యాయస్థానాన్ని కోరారు. దర్యాప్తును కవిత ప్రభావితం చేయగలుగుతారన్నారు. ఈ కేసులో కీలక వ్యక్తిగా ఉన్నారని.. సూత్రధారి, పాత్రధారి ఆమేనని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి నేడు కవితకు బెయిల్ నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.





## కేటీఆర్‌కు బ్రహ్మారథం..

హైదరాబాద్..కేటీఆర్‌కు మధ్య విడదీయరాని బంధం పెనవేసుకున్నది. ఇక్కడి ప్రజలు కేటీఆర్‌ను తమ ఇంట్లో వ్యక్తిగా స్వీకరించారు. ఒక్క క్లిక్‌తో సోషల్ మీడియాలో కేటీఆర్ ప్రజల సమస్యలను పరిష్కరించేవారు. ఎంతో మంది కష్టాలను తీర్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కేటీఆర్ రోడ్ షోలతో నగరవ్యాప్తంగా ప్రచారం చేసి.. బీఆర్ఎస్‌ను గెలిపించారు. ఈ సారి కూడా లోక్‌సభ బరిలో కేటీఆర్ రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి ఫలాలు కేసీఆర్ పాలనలో ఎలా ఉన్నాయి? కాంగ్రెస్ పాలనలో ఎలా ఉన్నాయి? అనే అంశాలపై ఓటర్లను చైతన్యం చేస్తున్నారు. కేటీఆర్ రోడ్ షోలకు ప్రజల్లోనూ విశేష స్పందన వస్తున్నది. తమ కండ్ల ముందే కేసీఆర్ చేసిన అభివృద్ధి కనిపిస్తుండటంతో బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార సభలు వెలవెలబో తుంటే.. కేటీఆర్ ప్రచార కార్యక్రమాలు మాత్రం జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ పరిస్థితులను బేరీజు వేసుకున్న కాంగ్రెస్ పెద్దలు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదనే అంచనాకు వచ్చినట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

## 9న మరోసారి రాహుల్ రాక.. 10న రాష్ట్రానికి ప్రియాంకా గాంధీ



హైదరాబాద్ : రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మరో దఫా రానున్నారు. ఈ నెల 9న ఉదయం 11 గంటలకు కరీంనగర్‌లో జరిగే జనజాతర సభకు, సాయంత్రం 6 గంటలకు ఎల్బీనగర్‌లోని సరూర్ నగర్‌లో జరిగే జనజాతర సభకు హాజరు కానున్నారు. అలాగే మరో అగ్ర నేత ప్రియాంకా గాంధీ ప్రచార షెడ్యూలూ ఖరారైంది. ఈ నెల 10న మధ్యాహ్నం 12 గంటలకు కామారెడ్డిలో, సాయంత్రం 4 గంటలకు తాండూరులో జరిగే జనజాతర సభల్లోనూ, సాయంత్రం 6గంటలకు షాద్‌నగర్‌లో జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌ల లో ఆమె పాల్గొని పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. తాండూరులో జరిగే సభకు సుమారు లక్ష మందికి సరిపడా సభా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. ఇటు వచ్చే ఐదు రోజులూ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి.. బిజీగా గడపనున్నారు. సోమవారం ఉదయం ఇబ్రహీంపట్నంలో.. సాయంత్రం ఉప్పల్‌లో జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొంటారు. అదే రోజున రాత్రి సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ప్రచారం చేస్తారు. మంగళవారం ఉదయం నర్సాపూర్‌లో జరిగే జనజాతర సభలో, సాయంత్రం వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలోనూ పాల్గొంటారు. అలాగే 8న సాయంత్రం ఆర్మూర్ కార్నర్ మీటింగ్, నిజామాబాద్‌లో జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొంటారు. 9, 10 తేదీల్లో రాహుల్, ప్రియాంకలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాలుపంచుకుంటారు.

# సంపాదకీయం

## మోడీ ఇప్పుడు ఎలాంటి మైండ్ సెట్ లో ఉన్నారు?

యావత్ దేశం ఇప్పుడు ఎన్నికల వేడిని ఎదుర్కొంటోంది. ఓవైపు భానుడి భగభగలు.. మరోవైపు ఎన్నికల వేడితో సగటు భారతీయుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పోటాపోటీగా సాగుతున్న ప్రచారంలో మోడీ అప్రతిహతంగా దూసుకెళుతున్నప్పటికీ... ఆయన టార్గెట్ పెట్టుకున్న 400 ప్లస్ ఎంపీ స్థానాలు దక్కుండా ఉండేందుకు రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. వారే కాదు.. వామపక్షవాదులు.. లౌకికవాదుల పేరుతోనూ ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఇలాంటివేళ.. ప్రధానమంత్రి మోడీ ఎలాంటి మైండ్ సెట్ లో ఉన్నారు? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పటం కష్టం. ఎందుకంటే.. ఆయన్ను నేరుగా కలిసిన జర్నలిస్టులు తక్కువగా ఉంటారు. ఆయనతో కాస్తంతఎక్కువసేపు మాట్లాడిన జర్నలిస్టులు.. అంతో ఇంతో అసెస్ చేయగలుగుతారు. అయితే.. ఇప్పటి వరకు అలాంటి అవకాశం లేకుండా ఉండేది. తాజాగా తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక ప్రముఖ మీడియా సంస్థకు చెందిన ఇద్దరు సీనియర్ జర్నలిస్టులు ప్రధానమంత్రి మోడీని కలవటం.. ఆయనతో మాట్లాడటం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి అనుభవం.. ప్రధాని మోడీ మాటల్లోనూ ఏం కనిపించింది? ఆయన్ను ప్రశ్నలు వేసినప్పుడు సమాధానాలు చెప్పే విషయంలో ఆయన వ్యవహారశైలి ఎలా ఉందన్న విషయానికి సంబంధించి ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. ఒక్కమాటలో చెప్పాలంటే.. మూడోసారి అధికారంలోకి రావటం ఖాయమై.. ఇక ప్రమాణ స్వీకారం చేయటమే మిగిలిందన్న భావన ప్రధాని నరేంద్ర మోడీలో ఉన్నట్లుగా అనిపించినట్లుగా చెబుతున్నారు. హ్యాట్రిక్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి వంద రోజుల్లోనే ఏయే పనులు చేయాలన్న దానిపై మోడీ కసరత్తు పూర్తి చేయటమే కాదు.. పక్కా ప్లానింగ్ లో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఇంతకూ ఎప్పుడూ ఏ సందర్భంలోనూ తెలుగు మీడియాకు ఇంటర్వ్యూ ఇవ్వని ప్రధాని మోడీ ఈసారి ఎందుకు ఇచ్చినట్లు? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. దీనికి అందుతున్న సమాచారం ప్రకారం.. ఈసారి ఎన్నికల్లో 370 సీట్లను సొంతంగా సాధించాలన్న పట్టుదలతో పాటు.. కూటమి 400లకు పైగా సీట్లను సొంతం చేసుకోవాలన్న లక్ష్యానికి చేరువ అయ్యేందుకు.. ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు మరింత సమాచారాన్ని అందించాలన్న ఉద్దేశం కనిపిస్తుందని చెబుతున్నారు. బీజేపీపైనా.. తనపైనా జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు వీలుగా ఇంటర్వ్యూ ఇచ్చినట్లుగా చెబుతున్నారు. మోడీ బాడీలాంగ్వేజ్ కానీ.. ఆయన మాటలు కానీ చాలా నమ్మకంగా తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవటం ఖాయమన్న భావన ఉందని చెబుతున్నారు. తన కమిట్ మెంట్.. తాను మాట ఇస్తే తప్పనన్న విషయాన్ని స్పష్టం చేసిన ఆయన.. ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రిని ఖాయమని నమ్ముతున్నట్లుగా చెబుతున్నారు. ఆయన్ను... ఆయన తీరును తప్పుపట్టేవారు.. ఆయన్ను కలిసి ఇంటర్వ్యూ చేసిన తర్వాత మాత్రం ఆయన మీద ఉన్నఅంతకు ముందున్న అభిప్రాయం తప్పక మారుతుందని మాత్రం చెబుతున్నారు.

## స్థానిక సమస్యలు పరిష్కారం అవ్వాలంటే సునీత మహేందర్ రెడ్డినే గెలిపించాలి..



శామీర్ పేట (గరుడ వార్త) : స్థానిక సమస్యలు పరిష్కారం అవ్వాలంటే సునీత మహేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలంటూ సీనియర్ నాయకులు అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి తోపాటుగా ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రచార నిర్వహించారు.

సోమవారం అలియాబాద్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ, కాంగ్రెస్ నాయకులు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి మాట్లాడుతూ... మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ కార్యకర్తలు అంతా ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజల్లో కూడా సునీత మహేందర్ రెడ్డి కె పట్టం కట్టాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. గత కొన్నేళ్లుగా మేడ్చల్ నియోజకవర్గం పై సునీత మహేందర్ రెడ్డి కి ఎంతగానో అవగాహన ఉందన్న విషయం గుర్తు చేశారు. మేడ్చల్ నియోజకవర్గం లో సునీత మహేందర్ రెడ్డి అందరికీ సుపరిచితురాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కే ఓటు వేయాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న తమకు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందని సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారంలో నాగరాజ్, టి యాదగిరి, బండి రామ్ రెడ్డి, ఎస్ కుమార్, ఎం ధర్మ రెడ్డి, ఎం మల్లేష్, ఎన్ బాలేష్, భరత్ తదితర కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మైసమ్మ తల్లి జాతర..





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ కట్ట మైసమ్మ తల్లి జాతరొత్సవం కన్నుల పండుగ కొనసాగింది. సోమవారం మండల కేంద్రం శామీర్ పేట పెద్ద చెరువు వద్ద శ్రీ కట్ట మైసమ్మ తల్లి జాతర భక్తుల కోలాహలం మధ్య కన్నుల పండుగ నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భవిష్యవాణి వినిపించారు. అనంతరం పోతరాజు నృత్యాలు చేస్తూ వీరంగం చేశారు. సాయంత్రం సర్వ్ గంప నిర్వహించారు. అనంతరం గంగాతప్ప చెరువులో వదిలారు. వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ తరఫున ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శామీర్ పేట గ్రామం నుంచి యువకు లు అమ్మవారికి తొట్టెలను బ్యాండ్ మేళాలు, డిజె సప్పులతో నృత్యాలు చేస్తూ ఊరేగించి మైసమ్మ ఆలయంలో వద్ద అమ్మవారికి సమర్పించారు.

## మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం అభివృద్ధియే ప్రధాన లక్ష్యం ...అధ్యక్షుడు చిట్టి మల్ల గణేష్

**మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా ఇకగ్రీవంగా ఎన్నికైన వెంకటగిరి ప్రసాద్.**



శామీర్ పేట, (గరుడ వార్త) : మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడి గా బొద్దుల వెంకటగిరి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడు చింతలపల్లి మండలం ఉద్దేమర్రి గ్రామానికి చెందిన బొద్దుల వెంకటగిరి ప్రసాద్ ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు చిట్టిమిల్ల గణేష్ చేతుల మీదుగా సోమవారం వెంకటగిరి ప్రసాద్ కు అందజేశారు. మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యాక్షుడి గా నియమితులైన వెంకటగిరి ప్రసాద్ ను చిట్టిమిల్ల గణేష్ అభినందించారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వెంకటగిరి ప్రసాద్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా తనను నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పద్మశాలి సంఘం అభివృద్ధికి తన సాయశక్తులకు కృషి చేస్తానని తెలిపారు. సంఘం సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా సంఘం తరపున పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర మాద హరి నారాయణ, జిల్లా కార్యదర్శులు సబ్బన్ రామకృష్ణ, కట్ట నర్సింగరావు, ముఖ్య సలహాదారులు కూరపాటి నాగేశ్వరరావు, పద్మశాలి సంఘం ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతం.

జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్లో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్, ఏర్పాటు చేయడం జరిగింది అని మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో ఇరవై నాలుగు గంటలు పని చేసే విధంగా ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల సౌకర్యార్థం ఏమైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2050 కు ఫోన్ చేయడానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు డబ్బు తరలింపులు, ఇతర ప్రలోభాలకు గురి చేసినట్లు ఎవరైనా గుర్తించిన ట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందచేయాలని, అందుకు సంబంధించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎన్నికల అధికారి, గౌతమ్ స్పష్టం చేశారు.



## పేదల కల నెరవేరేనా!

మెట్‌పల్లి : సింగరేణి స్థలాలను క్రమబద్ధీకరించి తమకు పట్టాలు ఇస్తారని ఏడు సంవత్సరాలుగా దాదాపు 186 మంది ఎదురుచూస్తున్నారు. సంస్థ విస్తరించి ఉన్న ఉమ్మడి ఆరు జిల్లాల్లో 19,124 మంది ప్రజలు సంస్థ స్థలాల్లో నివాస గృహాలు నిర్మించుకొని ప్రభుత్వం నుంచి పట్టాలు అందుకోగా అలాంటి భాగ్యం తమకెప్పుడు దక్కుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... రామగుండం నగరపాలక సంస్థ 15వ డివిజన్‌లోని తారకరామానగర్, భాస్కర్‌రావు నగర్ ఏరియాలో దాదాపు పాతిక సంవత్సరాల నుంచి 186 కుటుంబాల వారు సింగరేణి స్థలంలో రేకుల షెడ్లు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరిలో కొంతమంది సింగరేణి సంస్థలో పనిచేసి ఉద్యోగవిరమణ పొందిన వారు ఉండగా మరికొందరు సంస్థలో కాంట్రాక్టు కార్మికులుగా ఇతర కూలీ పనులు చేసుకొని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే ఉన్నారు. కాగా సింగరేణి స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నవారికి పట్టాలు ఇవ్వాలంటూ దాదాపు ఆరు సంవత్సరాల క్రితం రెవెన్యూ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా సంస్థ విస్తరించి ఉన్న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో నిర్దేశించిన స్థలాలను సింగరేణి యాజమాన్యం ప్రభుత్వానికి బదలాయించింది. రామగుండం నియోజకవర్గంలో మల్కాపూర్, కేకే నగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్, హనుమాన్‌నగర్, సంతోష్‌నగర్ ప్రాంతాల్లోని 923.93 ఎకరాల స్థలంలో కొంతభూమినే ఆర్జీ–2 యాజమాన్యం ప్రభుత్వానికి అప్పగించింది సింగరేణి క్వార్టర్ల మధ్యలో తారకరామానగర్, భాస్కర్‌రావునగర్



ప్రాంతాలకు చెందిన స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించలేదు. కాగా ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలంటూ స్థానికులు పలుమార్లు సింగరేణి యాజమాన్యానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సమస్యపై గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే సైతం అసెంబ్లీలో ప్రస్తావించారు. నేటికీ సమస్య పరిష్కారం కాలేదని.. ఇప్పటికైనా పరిశీలించి తమకు పట్టాలు ఇప్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**పదేళ్లుగా పన్నులు కడుతున్నాం**

**–బి.దామోదర్, స్థానికుడు**

పాతికేళ్లక్రితం ఈ ప్రాంతంలో ఇంటిని నిర్మించుకున్నాం. ప్రభుత్వానికి పదేళ్లుగా ఇంటిపన్ను, నల్లా పన్ను కడుతున్నాం. పట్టా ఇవ్వకపోవడం వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయి. పట్టాలు ఇవ్వాలంటూ పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నాం. అయినా ప్రయోజనం లేదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా ఇబ్బందులను గుర్తించి పట్టాలు ఇవ్వాలి.

## కన్నీళ్లే ఉబికి వస్తున్నాయ్!

మహబూబాబాద్ : తీవ్ర వర్షాభావ పరిస్థితులు.. అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు.. చేతికి వచ్చిన చేను నిలువునా నెర్రెలు బాయడంతో అన్నదాతలు కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.. కొత్తగా బోర్లు వేస్తే నీళ్లు వస్తాయన్న ఆశతో రూ.లక్షల్లో వెచ్చిస్తున్నారు.. నీళ్లు పడక.. పంట దక్కక అప్పుల పాలవుతున్నారు. పాతాళ గంగను పైకి తీసుకురావాలని భగీరథ ప్రయత్నం చేస్తూ.. నాలుగైదు బోర్లు వేస్తున్నా.. చుక్క నీరు పడటం లేదు.

**20 శాతమే ఫలితం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.61 లక్షల ఎకరాల్లో యాసంగి పంటలు సాగవుతుయి. భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు కొత్తగా బోర్ల తవ్వకంపై దృష్టిసారించారు. ఒక్కో రైతు కనీసం ఐదు వరకు వేస్తున్నారు. 350 నుంచి 900 అడుగుల లోతు వరకు తవ్విస్తున్నారు. 100 బోర్లు వేస్తే అందులో 20 శాతమే సక్సెస్ అవుతున్నాయని బోరు యంత్రాల నిర్వాహకులు చెబుతున్నారు.

**5 బోర్లు.. రూ.1.60 లక్షల ఖర్చు** భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లికి చెందిన కనుమరుగుల సదయ్య పొలంలో బోరు వేస్తున్న దృశ్యమిది.. యాసంగిలో 8 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రూ.1.20 లక్షల పెట్టుబడి అయింది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఇప్పటివరకు 5 బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు.



రూ.1.60 లక్షల ఖర్చు చేశారు. అప్పే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**చుక్క నీరు రాలే..** బోరు వేసిన చోటును చూపిస్తున్న ఈ రైతు జనగామ జిల్లా లింగాలఘనపురం గ్రామానికి చెందిన జాగిళ్లపురం అబ్బులు... మూడు బోరుబావుల కింద 2 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇటీవల బోర్లలో నీరు తగ్గి పొలం ఎండిపోతుండటంతో రూ.50 వేలు వెచ్చించి 2 బోర్లు వేయిస్తే చుక్క నీరు రాలేదు. ఎకరన్నర వరి పంటను రూ.9 వేలకు గొర్రెల మేతకు విక్రయించారు. సుమారు 1.80 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయారు.

**రూ.3.50 లక్షలు ఖర్చు..**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావితండాకు చెందిన ఆంగోతు సత్తమ్మ రెండెకరాల్లో వరి సాగుచేశారు. పంట చేతికొస్తుందన్న సమయంలో నీరందక పొలం ఎండింది. దీంతో ఒకే రోజు నాలుగు బోరు బావులను తవ్వించారు. 300 అడుగులు వేసినా చుక్క నీరు రాలేదు. పెట్టుబడులు, బోర్ల తవ్వకానికి రూ.3.50 లక్షల వరకు అప్పయిందని సత్తమ్మ విచారం వ్యక్తం చేశారు.

**ఎనిమిది బోర్లు వేయించినా..**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావితండాకు చెందిన కునుసోతు శ్రీను రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నీటిఎద్దడి తలెత్తడంతో మూడు రోజుల వ్యవధిలో ఎనిమిది బోరుబావులను తవ్విస్తే చుక్క నీరు రాలేదు. సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

**బోరు డ్రిల్లింగ్‌కు ఖర్చు ఇలా..**

డ్రిల్లింగ్ చేసినందుకు(ఫీట్) : రూ.90 కేసింగ్‌కు(ఫీట్) : రూ.300(ఆరున్నర ఇంచులు), రూ.400(ఎనిమిది ఇంచులు)

# ఉత్కంఠ పోరులో ఆధిక్యాలు స్వల్పమే

హైదరాబాద్: రాజధాని పరిధిలో ఇప్పటి వరకు జరిగిన ఎంపీ ఎన్నికల్లో అత్యల్ప మెజార్టీ నమోదైంది హైదరాబాద్‌లోనే. 1984 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ 3,481 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో 7.7లక్షల మంది ఓటర్లుండగా.. సుమారు 6లక్షల మంది ఓటేశారు. సలావుద్దీన్‌కు 2,22,187 ఓట్లు, సమీప తెదేపా అభ్యర్థి కె.ప్రభాకర్‌రెడ్డికి 2,18,706 ఓట్లు వచ్చాయి.సికింద్రాబాద్‌లో.. సికింద్రాబాద్‌లో 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎం హాషీమ్ 3,847 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో మొత్తం 6,15,045 మంది ఓటర్లు ఉండగా 3,37,559 (54.9 శాతం) మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఎం.హాషీమ్‌కు 1,60,230 ( 47.5 శాతం) ఓట్లు రాగా.. సమీప భారతీయ లోక్‌దళ్ అభ్యర్థి టి.లక్ష్మీకాంతమ్మకు 1,56,383 (46.3 శాతం) ఓట్లు వచ్చాయి.

2009లో మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గాలు ఏర్పడగా..ఇప్పటి వరకు మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. మల్కాజిగిరిలో 2019లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి 0.70 శాతం (10,919 ఓట్లు) తేడాతో విజయం సాధించారు. చేవెళ్లలో 2019లో జరిగిన ఎన్నికల్లో తెరాస అభ్యర్థి జి.రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో రంజిత్‌రెడ్డి 1.12 శాతం (14,317) ఓట్లతో గెలుపొందారు.

**అప్రమత్తతతోనే నకిలీ ఓట్లకు అడ్డుకట్ట**

ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో అధికారులు పోలింగ్ సజావుగా పూర్తిచేసే చర్యలపై దృష్టిపెట్టారు. గతంలో నాంపల్లిలో ఓ ఓటరు తన చేతి వేలిపై వేసిన సిరా గుర్తును రసాయనంతో చెరిపేసుకుని, ఇంకోసారి ఓటు వేసేందుకు యత్నిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈ తరహా ఘటనలు చోటు చేసుకున్నాయనే ఫిర్యాదులొచ్చాయి. రాబోయే ఎన్నికల్లో అలాంటివాటికి తావు ఇవ్వొద్దని అధికారులు సంకల్పించారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ఓటర్ల ముఖాన్ని, ఓటరు కార్డులోని ఫొటోలను జాగ్రత్తగా పరిశీలించాలని, అలాగే మహిళా ఓటర్ల ముఖాలను సరిచూసేందుకు తప్పనిసరిగా కనీసం ఓ మహిళా అధికారికి విధులు కేటాయించినట్లు జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం స్పష్టం చేసింది.

**6గంటల వరకు పోలింగ్‌తో లాభమే**

ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం, వేడి గాలుల ధాటికి జనం భయపడుతున్న సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు పొడిగించడంపై జీహెచ్‌ఎంసీ సంతోషం వ్యక్తం చేస్తోంది. పోలింగ్ పెరిగేందుకు ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. వాతావరణం నాలుగు గంటల నుంచి చల్లబడుతున్నందున, ఉదయం ఓటు హక్కు ఉపయోగించుకోని వృద్ధులు, దివ్యాంగులు, ఇతర ఓటర్లు సాయంత్రం వేళ పోలింగ్ కేంద్రానికి వెళ్లొచ్చన్నారు

# గతి తప్పిన గణితం... వికసించని విజ్ఞానం

పాల్వంచ : పదోతరగతి ఫలితాల్లో గతంతో పోలిస్తే రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మెరుగైన స్థానం దక్కింది. అయితే ఆశించిన స్థాయిలో ఉత్తీర్ణులు కాలేదు. గణితం, విజ్ఞానశాస్త్రంలో విద్యార్థులు బాగా వెనుకబడటమే దీనికి ప్రధాన కారణం. కొందరు మాతృభాషలో, మరికొందరు ఆంగ్ల సబ్జెక్టులో సమాధానాలు రాసేందుకు ఇబ్బందిపడ్డారు. గతేడాది పది పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 78.52 కాగా, ఈసారి 90.39 శాతానికి పెరిగింది. గణితం, విజ్ఞానశాస్త్రంలో బాగా రాణించినట్లయితే రాష్ట్రస్థాయిలో మరింత మెరుగైన స్థానం దక్కేదని జిల్లా విద్యాశాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు.

**ఈసారి 26వ స్థానంలో నిలిచినా..**



తాజా ఫలితాల్లో అనుత్తీర్ణత శాతం రాష్ట్రస్థాయి ర్యాంకుపై ప్రభావం చూపింది. 2022, 2023లో వరుసగా 29వ స్థానానికే పరిమితమైన భద్రాద్రి జిల్లా ఈసారి 26కి ఎగబాకడం కాస్త ఊరటనిచ్చేదే. అంతకంటే మెరుగైన ర్యాంకు దక్కించుకునేందుకు అవకాశాలు లేకపోలేదు. కొందరు విద్యార్థులు మాతృభాష తెలుగులో కనీస మార్కులు సాధించలేకపోవడం ఉపాధ్యాయులను అంతర్మథనంలో పడేస్తోంది. గణితం, విజ్ఞానశాస్త్రం తర్వాత ఎక్కువ మంది అనుత్తీర్ణులైనది సాంఘిక (ఆంగ్లమాధ్యమం)లోనే. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ విద్యాలయాల్లో ఒక్కరైనా 10 జీపీఏ సాధించకపోవటం గమనార్హం. కేవలం ఆశ్రమ, బీసీ గురుకులానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఈ ఘనత చాటారు.


**బదిలీలు.. ఆపై ఎన్నికలు**

2023 సెప్టెంబర్‌లో ఉన్నత పాఠశాలల్లో పీజీ హెచ్.ఎం.లు, ఎస్.ఎ. ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగోన్నతులు జరిగాయి. తద్వారా కొన్ని విద్యాలయాల్లో పోస్టుల కొరత ఏర్పడగా, మరికొన్ని చోట్ల కొత్తగా వచ్చినవారు విద్యార్థులకు అనుగుణంగా బోధించలేకపోయారు. ఆతర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కొన్నాళ్లు ఉపాధ్యాయులు ఎన్నికల విధులకు వెళ్లారు. బదిలీల ఇబ్బందులతో పాటు పోస్టుల కొరత విద్యార్థుల సన్నద్ధతపై తీవ్ర ప్రభావం చూపింది. సైన్స్‌లో జీవశాస్త్రం, భౌతికశాస్త్రం పేపర్లతో పరీక్ష నిర్వహించినా కొందరు కనీస మార్కులు సాధించలేకపోయారు. ఆంగ్ల మాధ్యమం సాంఘికశాస్త్రంలో ప్రశ్నలను సరిగా అర్థం చేసుకోలేకపోయారు. సప్లిమెంటరీలోనైనా అనుత్తీర్ణులను గట్టెక్కించేలా విద్యాశాఖ చొరవ తీసుకుంటోంది. సబ్జెక్టుల వారీగా తరగతులు నిర్వహించనుంది. సెలవుల్లో పనిచేసే వారికి ఈఎల్స్(ఎర్న్‌డ్ లీవ్స్) ఇచ్చేలా రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీచేయాల్సిన అవసరం ఉంది.

'పది' పరీక్షల్లో అనుత్తీర్ణులైన వారికి సబ్జెక్టుల ఉపాధ్యాయులతో దాదాపు అన్ని మండలాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూస్తున్నాం. ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన 'అభ్యాస దీపికలు' సాధన చేయించేలా పర్యవేక్షిస్తాం. జూన్ 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి.

– వెంకటేశ్వరాచారి, డీఈఓ

# ఓటర్లు భిన్నం.. ఓటింగ్ విభిన్నం



హైదరాబాద్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనది. కొన్ని సందర్భాల్లో ఒక్క ఓటు కూడా కీలకంగా మారుతుంది. ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటును ఉపయోగించుకోలేరు. దీంతో భారత ఎన్నికల సంఘం పలు రకాల పద్ధతులను అవలంబిస్తోంది. ఎన్నికల విధుల్లో ఉన్నవారు, సైనికులు, ఎన్నారైలు, గూఢచారి వ్యవస్థలో పనిచేస్తున్నవారు, వయోవృద్ధులు ఓటు ఉపయోగించు కునేందుకు వివిధ మార్గాలను కల్పించింది. వాటి గురించి తెలుసుకుందాం..

ప్రాక్సీ ఓటు: సాయుధ దళాలు, గూఢచారి, ఇంటిలిజెన్స్, బోర్డర్ రోడ్స్ డెవలప్‌మెంట్ బోర్డు కింద పనిచేస్తున్నవారు ప్రాక్సీ ఓటును వినియోగించుకుంటారు. ఈ పద్ధతిలో ఓటు హక్కును వినియోగించుకునే సేవా ఓటరును 'క్లాసిఫైడ్ సర్వీస్ ఓటర్' (సీఎస్‌వీ)గా పేర్కొంటారు. సేవా ఓటరు తన నియోజకవర్గంలో ఓటరుగా నమోదైన వ్యక్తిని ప్రాక్సీ (ప్రతినిధి)గా నియమించుకోవచ్చు. సేవా ఓటరుకు బదులు తమ ప్రతినిధి నేరుగా ఓటు వేస్తారు. ప్రాక్సీ ఓటింగ్ తమకు సైతం వర్తింపజేయాలని ఎన్నారైలు డిమాండ్ చేస్తున్నారు.

ఈడీసీ ద్వారాతమ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు అదే కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఈసీ కల్పించింది. అలాంటి వారు ఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్) తీసుకొని తాము విధులు నిర్వర్తిస్తున్న పోలింగ్ కేంద్రంలోనే ఓటు వేయవచ్చు.

**సర్వీసు ఓటు**

ఆర్మీ, నౌకా దళం, ఎయిర్ ఫోర్స్, అసోం రైఫిల్స్, బీఎస్‌ఎఫ్, ఐటీబీపీ, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్ మొదలైన సాయుధ బలగాల్లో పనిచేసేవారు, రాష్ట్రం వెలుపల విధులు నిర్వర్తిస్తున్న రాష్ట్ర సాయుధ పోలీసు దళ సభ్యులను, వారితోపాటు నివసించే తమ భార్య లేదా భర్తను సర్వీసు ఓటర్లుగా గుర్తిస్తారు. వీరు ముందుగా తమ స్వస్థలంలోని ఓటరు జాబితాలో సర్వీసు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలి. అనంతరం సంబంధిత రిటర్నింగ్ అధికారి పంపించిన పోస్టల్ బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటును వినియోగించుకుంటారు.

**ఎన్నారైలు ఇలా**

భారతీయ పౌరసత్వం ఉండి విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం ఇతర దేశాలకు వెళ్లి అక్కడే ఉంటున్నవారు ఉన్నారు. అలాంటి వారు ఫారం-6ఏ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. పాస్‌పోర్టు సైజు ఫొటో, వీసా, పాస్‌పోర్టు నకలు తదితర ధ్రువపత్రాలను సమర్పించి ఓటు హక్కును నమోదు చేసుకోవాలి. అనంతరం పోలింగ్ రోజు వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది.

**పోస్టల్ బ్యాలెట్**

ఎన్నికల విధుల్లో భాగంగా ఉద్యోగులు తమ నియోజకవర్గంలో కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి వారి కోసం ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది.

టెండర్ ఓటు: ఎన్నికల రోజు వరకు ఓటరు జాబితాలో పేరు ఉండి, పోలింగ్ కేంద్రం వద్ద గల్లంతు కావడం, తమ ఓటును వేరే వారు వేయడం లాంటి పరిస్థితుల్లో వారికి టెండర్ ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పిస్తారు. ఓటరు అంతకు ముందు ఓటేయలేదని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

**సాధారణ ఓటు**

భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీన్ని సాధారణ ఓటు అంటారు. ఇలా నమోదు చేసుకున్నవారు పోలింగ్ రోజు సంబంధిత బూత్‌లో ఓటు వేస్తారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి వద్దే ఓటేసేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తోంది.

# పోస్టల్ ఓట్లు.. అభ్యర్థుల పాట్లు




కరీంనగర్: పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం అభ్యర్థులు పాట్లు పడుతున్నారు. ఓ వైపు సాధారణ ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రచారాన్ని సాగిస్తూనే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులపై దృష్టి పెట్టారు. తెలిసిన వారికి పదే పదే మరోమారు తమకు ఓటు వేయాలని విన్నపాలు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టేలా చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఉద్యోగులు, సిబ్బందికి ఓటు వేసే అవకాశాన్ని జిల్లా ఎన్నికల అధికారులు కల్పించారు. ఫారం-12 తీసుకుని దరఖాస్తు చేసుకున్న వారికి ఈ అవకాశాన్ని అందిస్తున్నారు. అత్యవసర సేవల్లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం ఇస్తుండగా.. శనివారం నుంచి మాత్రం ఉద్యోగులు వారి ఓటు ఉన్న నియోజకవర్గ పరిధిలో ఓటు వేసే వెసులుబాటు కల్పించారు. ఇలా కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 18 వేల మంది పోలింగ్ సిబ్బందితోపాటు మరో 8 వేల మంది పోలీసులు ముందే ఓటెయ్యబోతున్నారు. ఇందులో చాలామంది ఇక్కడి నియోజకవర్గాల్లో ఓటు హక్కు లేకపోవడంతో ఓటింగ్ పట్ల ఆసక్తిని చూపించడం లేదు. కొందరు ఉన్న చోటకు వెళ్లి ఈ అవకాశాన్ని వినియోగించుకోనున్నారు.

**శాసనసభ నియోజకవర్గాల వారీగా..**

ప్రతి శాసనసభ నియోజకవర్గ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కరీంనగర్, నిజామాబాద్‌లలో ఎక్కువ దరఖాస్తులు రావడంతో ఇక్కడ మూడు, నాలుగు కేంద్రాలను అందుబాటులో ఉంచారు. రహస్య ఓటింగ్‌కు వీలుగా ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో దాదాపు 52 శాతం వరకు చెల్లకుండా పోయాయి. ఈసారైనా సరైన విధానంలో ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పైగా ఉద్యోగులు పోస్టల్ ఓటు విషయంలోనూ అనుకున్న విధంగా పోలింగ్ శాతం పెరగడం లేదు.

**వృద్ధుల కోసం ఇళ్ల వద్దకు...**

పీడబ్ల్యూడీ (పర్సన్స్ విత్ డిసేబుల్), సీనియర్ సిటిజన్లకు సంబంధించి ఓటు నమోదు కోసం శుక్రవారం నుంచి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లనున్నారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి పర్యవేక్షణలో వీడియోగ్రాఫర్ సహా ఓ పర్యవేక్షకుడు ఇతర సిబ్బంది అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారి ఓటు హక్కు రహస్యంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టనున్నారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులతోపాటు కదలని స్థితిలో ఉండి పోలింగ్ కేంద్రానికి రాని వారు ఈ విధానంలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో 700 నుంచి వెయ్యి మంది వరకు ఈ విధానంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు..

# లాడ్జిలపై ఏదీ నిఘా?

భువనగిరి : ప్రసిద్ధ పుణ్య క్షేత్రం యాదగిరిగుట్టలో లాడ్జిల నిర్వహణ అధ్వానంగా మారింది. ఎవరు వస్తున్నారో.. ఎవరు పోతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇటీవల ఓ గుర్తు తెలియని వ్యక్తి ఓ లాడ్జిలో చనిపోవడం, అతని సంబంధించిన ఆధారాలు, అతనితో వచ్చిన వ్యక్తుల ఆధారాలు రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడం, కనీసం సీసీ కెమెరాల ఫుటేజీ లేకపోవడాన్ని బట్టి లాడ్జి నిర్వహణ తీరుకు అద్దం పడుతోంది.నిబంధనలు ఇవి..యాదాద్రి దేవస్థానం అభివృద్ధి కావడం, భక్తుల సంఖ్య పెరగడంతో వారికి అనుగుణంగా పట్టణంలో ప్రైవేటు లాడ్జిలు అనేకం పుట్టుకొచ్చాయి. మొత్తం 86 ఉండగా మరికొన్ని నివాసాల్లోనే కొన్ని గదులను అద్దెకు ఇచ్చి నిర్వహించే వారున్నారు. భక్తులైన, సాధారణ పౌరులైన లాడ్జిలో చేరే ముందు వారి ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డుల ద్వారా వివరాలను, చరవాణి సంఖ్యను నమోదు చేసుకోవాలి. అవసరమైతే గుర్తింపు కార్డు నకలు స్వీకరించాలి. గదులు మినహా కౌంటర్, వెలుపల ఆయా ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఉగ్రవాదులు, అనుమానాస్పద వ్యక్తులకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు గదులను అద్దెకు ఇవ్వకూడదు. సందేహంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వ్యభిచారులు, విటులు, అక్రమ సంబంధికులకు ఎట్టి పరిస్థితిలో గదులు ఇవ్వొద్దు. చుట్టూ ఉన్న ఆవాసులకు ఇబ్బందులు కలిగించొద్దు వంటి నిబంధనలతో లాడ్జిల నిర్వహణ చేపట్టాలి. లాడ్జిల నిర్వహణపై పోలీసుల సరైన నిఘా లేకపోవడంతో ఈ నిబంధనలు తుంగలో తొక్కేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనలు పాటించేలా పోలీసులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం

– రమేశ్, సీఐ, యాదగిరిగుట్ట ఠాణా.

ప్రతీ లాడ్జి యజమానులు రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. రోజుకు ఎంత మంది వచ్చారో, ఆ వివరాల జాబితాను ఠాణాలో ఇవ్వాలి. దీనిపై లాడ్జి నిర్వాహకులకు నోటీసులు ఇస్తున్నాం. నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం. ఎన్నికల తర్వాత దీనిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# సౌరమే సౌభాగ్యం

ఖమ్మం : ప్రపంచానికి వెలుగునిచ్చే సూర్యుడు మానవాళికి జీవనాధారం.. వెలుగు లేకపోతే మనుగడ లేదు. అలాంటి సూర్యుడికి ఒకరోజు ఉంది. అపరిమితమైన సౌరశక్తిని ఒడిసిపడితే సంప్రదాయ ఇంధన వనరులను తరిగిపోకుండా కాపాడుకోవచ్చు. ఈసారి సరిపడినంత వర్షాలు లేవు. ఇప్పటికే సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జలాశయాల్లో నీరు అడుగంటుతోంది. రాష్ట్రంలో ప్రధానంగా నీటి(హైడల్)తోనే విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. ఇది సరిపోవడం లేదు. బొగ్గు నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్తు(థర్మల్)కు సైతం నీరు కావాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భంలో ఎప్పటికీ తరిగిపోని సౌరశక్తితో విద్యుత్తును విరివిగా ఉత్పత్తి చేయాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సౌరశక్తి వినియోగం, లోటుపాట్లు వంటి అంశాలపై ప్రత్యేక కథనం...

**కాలుష్య రహితం..**

సౌరశక్తిని ప్రోత్సహించేందుకు సూర్య దినోత్సవాన్ని ప్రతిపాదించారు. సౌరవిద్యుదుత్పత్తి సమయంలో పర్యావరణానికి ఎటువంటి హాని చేసే ఉద్గారాలు ఉత్పత్తి కావు. అందుకే దీనిని 'గ్రీన్ ఎనర్జీ' అంటారు. ఉత్పత్తి అత్యంత చవక. ఎక్కడైనా, ఎంత కొద్ది మొత్తంలోనైనా ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. నివాసాలపైనా, ఖాళీ స్థలాల్లో, పంట పొలాల్లో వీటి పలకలను(సోలార్ ప్యానల్స్) ఏర్పాటు చేసుకుని ఇన్వర్టర్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు. బ్యాటరీల్లో నిల్వ చేసుకుని వినియోగించుకోవచ్చు.

సౌర విద్యుత్తు ఉత్పత్తిని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్ రెడ్‌కో) 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన పథకం(పీఎం సూర్యఘర్ స్కీం)' ద్వారా ప్రోత్సహిస్తోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నడుస్తున్నాయి. ప్రతి ఇంటికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించడం లక్ష్యం. రూ.78 వేల వరకు రాయితీని అందిస్తున్నారు.

ఈ విద్యుత్తు ఉపయోగించి కోతులు, ఇతర జంతువుల నుంచి ఇళ్లు, పంట పొలాలకు రక్షణ కల్పించుకోవచ్చు.

ఉత్పత్తి చేసి మనం వినియోగించుకోగా మిగిలింది ప్రభుత్వానికి విక్రయించవచ్చు. పరికరాలు అమర్చినప్పుడే మిగిలి విద్యుత్తు గ్రిడ్‌కు వెళ్లేలా అనుసంధానిస్తారు. ఆరునెలలకోసారి మన బ్యాంకు ఖాతాకు డబ్బు చెల్లిస్తారు.

**ఇవిగో సౌర వెలుగులు..**

సౌర విద్యుత్తు ఉత్పత్తిలో సమీకృత జిల్లా కలెక్టరు కార్యాలయం ఆదర్శంగా నిలుస్తోంది. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని ఈ కార్యాలయం ప్రాంగణంలో 2023 అక్టోబరు నుంచి సౌర ఫలకాలను ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. 100 కేవీఏ హెచ్‌టీ, 100 కేవీఏ ఎల్‌టీ సౌర ఫలకాలతో నిత్యం సుమారు 900 యూనిట్ల విద్యుత్తు, నెలకు 24 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతోంది. వినియోగించుకోగా మిగిలిన విద్యుత్తును ఆన్‌గ్రిడ్‌కు అందజేస్తున్నారు. ప్రతినెలా సుమారు రూ.2 లక్షలకుపైగా విద్యుత్తు బిల్లు ఆదా అవుతోంది.

ఖమ్మం నగరపాలక సంస్థ చైతన్యనగర్ రూ.10 లక్షల ఖర్చుతో పార్కులో 10 కేవీ సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటు చేసింది. నగరపాలక సంస్థ కార్యాలయంపై వంద కిలోవాట్లు, ఆవరణలో 30 కేవీ సౌర విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నారు.

**ఏమిటీ దినోత్సవం**

1978లో అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ దీన్ని ప్రతిపాదించారు. మే 3న అంతర్జాతీయ సూర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. అమెరికాలో ప్రారంభమైన ఈ ఆచారం ప్రస్తుతం ప్రపంచంలోని అన్ని దేశాల్లో పాటిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకుంటే మేలు...**

ప్రస్తుతం సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అందించే ఆన్‌గ్రిడ్ సర్వీసులు 620 ఉన్నాయి. ఇందులో గృహ విద్యుత్తు 456, వాణిజ్యం 121, చిన్న పరిశ్రమలు 5, పాఠశాలలు/దేవాలయాలు 38 ఉన్నాయి. ప్రాథమికంగా కొంత ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు. విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. ప్రతినెలా చెల్లించే విద్యుత్తు బిల్లు మొత్తాన్ని దీర్ఘకాలం లెక్కిస్తే ఇది తక్కువే. పంట పొలాల్లో సైతం కొద్దిమందే ఏర్పాటు చేసుకున్నారు.

# పట్టభద్రులూ ఓటుకు పోటెత్తాలి

కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ గురువారం వెలువడింది. 2021లో జరిగిన ఎన్నికలో ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. గత శాసనసభ ఎన్నికల్లో భారాస తరఫున జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించటంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అనివార్యమైంది.

**ఆశ్చర్యపరుస్తున్న చెల్లని ఓట్లు**

2021లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో 5,05,565 మందికి 3,87,969 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో 21,636 మంది ఓట్లు చెల్లకపోవటం గమనార్హం. సాధారణ ఓటుహక్కు మాదిరిగా కాకుండా పట్టభద్రులు తమ ఓటుహక్కును ప్రాధాన్య క్రమంలో వినియోగించుకోవాలి. అంటే పోటీలో నిలిచిన అభ్యర్థులకు ప్రాధాన్య క్రమంలో ఓటేయాలి. ఈ విధానంపై కొందరికి అవగాహన లేకపోవటంతో వారి ఓట్లు చెల్లకుండా పోతున్నాయి.

**ఓటరు నమోదులో కనిపించని చైతన్యం**

2021లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో 5,05,565 మంది ఓటర్లు ఉండగా.. ఇటీవల ఎన్నికల సంఘం వెలువరించిన ఓటరు తుది జాబితా ప్రకారం 4,61,786 మంది ఓటర్లుగా నమోదయ్యారు. గతంలో పోల్చితే ఓటర్ల సంఖ్య తగ్గింది. పట్టభద్రులు ఓటు నమోదుపై ఆసక్తి చూపకపోవటమే దీనికి కారణం. సాధారణ ఓటుహక్కు మాదిరిగా కాకుండా ఎన్నికలు జరిగే ప్రతిసారీ పట్టభద్రులు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

**పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరచాలి**

ఎన్నిక ఏదైనా ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాభీష్టం మేరకు నాయకులు ఎన్నికవుతారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లు అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవటంపై ఈసీ దృష్టి సారిస్తోంది. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించేలా చర్యలు తీసుకుంటోంది. 2015లో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల స్థానంలో 54.62 శాతం పోలింగ్ నమోదైతే 2021లో 76.35శాతానికి పెరిగింది. ఈసారి పట్టభద్రుల ఓటర్లు తగ్గటంతో పోలింగ్ శాతం ఏ మేరకు నమోదవుతుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. గత ఎన్నికల్లో చాలా పోలింగ్ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించలేదనే విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగు పరచటంపై ఈసీ దృష్టి సారించాల్సి ఉంది.జూన్ 5న ఓట్ల లెక్కింపుఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీ చేయాలనుకునేవారు నల్గొండ కలెక్టర్ కార్యాలయంలో నామపత్రాలు సమర్పించాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నామపత్రాలు దాఖలు చేయవచ్చు. ఈనెల 9 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 10న నామినేషన్ల పరిశీలన, 13 వరకు ఉపసంహరణకు అవకాశం ఉంది. 27న పోలింగ్ జరగనుంది. జూన్ 5న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రిటర్నింగ్ అధికారిగా నల్గొండ కలెక్టర్ వ్యవహరిస్తున్నారు.

# మందకొడిగా ఆస్తి పన్నుల వసూళ్లు

జనగామ : పురపాలికలకు ఆస్తి, నల్లా తదితర పన్నుల రూపేణా వచ్చే ఆదాయమే ప్రధాన వనరు. కార్యాలయ నిర్వహణ, పారిశుద్ధ్యం, నీటిసరఫరా తదితర పౌరసేవల నిర్వహణకు, ఒప్పంద కార్మికుల వేతన చెల్లింపులకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే ఆధారం. జనగామ పురపాలిక పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నుల వసూళ్లు ఆశించిన రీతిలో జరగడం లేదు. పన్నుల రూపేణా వసూలయ్యే సొమ్ములో కనీసం రెండు మూడు మాసాల వేతనాలకు సరిపోయే నిధులను సాధారణ నిధుల ఖాతాలో జమచేసి, ఇతర ఖర్చులకు వెచ్చించాలనే నిబంధన ఉంది. వసూళ్లు ఆశించిన రీతిలో జరగడం లేదనే కారణంతో జనగామ మున్సిపల్ ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు మాసాలుగా వేతనాలు ఇవ్వడం లేదు. గత ఆరు మాసాలుగా ఒక నెల వేతనం బకాయి ఉంటోంది. పన్నుల వసూళ్ల లక్ష్యం సాధించాల్సిన మార్చి నెలలోనూ వారికి వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల వేతనాల కోసం జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ముందు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

**వడ్డీపై 90 శాతం రాయితీ ఉన్నా..**

మున్సిపల్ పరిధిలోని ప్రైవేటు ఆస్తుల మీద గత బకాయిలు, వాటిపై వడ్డీ, ప్రస్తుత వార్షిక పన్ను మొత్తం రూ.5 కోట్ల 25 లక్షలు లక్ష్యం. ఇందులో గత బకాయిలు రూ.86.09 లక్షలు, వాటిపై జరిమానా రూ.76.04లు వసూలు కావాల్సి ఉండటం గమనార్హం. 2022-



23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, వడ్డీ సహా ఏక మొత్తంలో చెల్లించే వారికి వడ్డీపై 90 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించినా పన్ను చెల్లింపుదారులు ముందుకు రావడం లేదు. పండగలు, మేడారం జాతర, ఇప్పుడు బిడ్డల చదువుల ఫీజులను కొందరు కారణాలుగా చూపుతున్నారు. మరికొందరు తమ కాలనీల్లో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని నిలదీస్తున్నారు.

మొండి బకాయిలు..జనగామ మున్సిపల్ పరిధిలో పేద, మధ్య తరగతి వర్గాల నుంచి పన్నుల వసూళ్లకు వత్తిడి పెంచుతున్నారు. 80 ప్రభుత్వ భవనాల పన్ను, వడ్డీ బకాయిలు రూ.95.32 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఆర్డీవో, తహసిల్, టెలిఫోన్‌భవన్, విద్యుత్తు, ఆర్టీసీ, పోలీసు తదితర శాఖల భవనాల ఆస్తి పన్ను రావడం లేదు. రూ.34 లక్షలు పన్ను బకాయిలుంటే, రూ.49 లక్షల మేర అపరాధ రుసుము బకాయిలున్నాయి. వడ్డీ మాఫీ రాయితీని ఉపయోగించుకుంటే, ప్రభుత్వ ఆస్తులపై పన్ను చెల్లింపు భారం తగ్గుతుంది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపాల్సి ఉంది.

**ఈ నెల 7వరకు ఇవీ వివరాలు**

ప్రైవేటు ఆస్తులు- 14694, బకాయిలతో కలిపి డిమాండ్- రూ.5కోట్ల 25 లక్షలు, వసూలు- 2కోట్ల 60 లక్షలు (49.61శాతం), బ్యాలెన్స్- 2కోట్ల 65 లక్షలు.

ప్రభుత్వ ఆస్తులు-80, గత పన్ను బకాయిలు-రూ.34.71లక్షలు, జరిమాన-రూ.49.94లక్షలు, ప్రస్తుత వార్షిక పన్ను-రూ.9.69 లక్షలు, దీనిపై వడ్డీ-96980.

మొత్తం పెండింగ్‌లో- రూ.95,332,501.

# ఆ రెండు ఆదర్శం

కొత్తగూడ : గ్రామ పంచాయతీ పన్నుల వసూళ్లలో ఏజెన్సీలోని మారుమూల మండలం గంగారం సహా నియోజకవర్గ కేంద్ర మండలం డోర్నకల్ వందశాతం లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఏజెన్సీలోని మరో మండలమైన కొత్తగూడలో ప్రభుత్వ కార్యాలయాలు మినహా ఇళ్ల యజమానులందరూ పన్ను చెల్లించారు. పంచాయతీలు వసూలు చేసే పన్నులో జిల్లాలోని మారుమూల ఏజెన్సీ గ్రామాలు ఆదర్శంగా నిలిచాయి. నూరుశాతం పన్నును వసూలు చేసి జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

2023-24 ఏడాదికి సంబంధించి గంగారం మండలంలోని 12 పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలైంది.

కొత్తగూడ మండలంలోని 24 పంచాయతీల్లో 23 వంద శాతం చెల్లించాయి. కొత్తగూడలో అధికంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గురుకులాలు ఉండడంతో వీటికి సబంధించిన పన్ను ఎవరూ చెల్లించక నూరుశాతానికి చేరుకోలేకపోయింది. ప్రజలు మాత్రం నూరుశాతం చెల్లించి ఆదర్శంగా నిలిచారు.

జిల్లాలో డోర్నకల్ మండలం వందశాతం టాక్స్ చెల్లించి మొదటి




స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో గంగారం, మూడోస్థానంలో తొర్రూరు, నాలుగో స్థానంలో కొత్తగూడ మండలాలు చోటు దక్కించుకున్నాయి. చివరగా పెద్దవంగర, కేసముద్రం మండలాలు ఉన్నాయి. మార్చిలోగా పన్ను వసూళ్లను పూర్తిచేయాల్సి ఉంది.

**కార్యదర్శులు, సిబ్బంది కృషి**

నూరుశాతం ఆస్తి పన్ను వసూళ్లకు ఏజెన్సీ మండలాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు కృషి చేశారు. జనవరి నుంచి లక్ష్యం పెట్టుకుని ఇల్లిల్లు తిరుగుతూ వసూలు చేశారు. ఉపాధి నిమిత్తం పట్టణ ప్రాంతాల్లో ఉండేవారికి కూడా సమాచారాన్ని అందించి చెల్లించేలా చర్యలు చేపట్టారు. దీంతో పలు పంచాయతీల్లో లక్ష్యం పూర్తైంది. నూరుశాతం పన్ను వసూళ్లపై ఆయా ఎంపీడీవోలు సైతం పంచాయతీ కార్యదర్శులను ప్రోత్సహిస్తుండడంతో వారి టార్గెట్‌లను పూర్తిచేశారు. వీరి శ్రమతోనే ఏజెన్సీ మండలాలు జిల్లాలో ఆదర్శంగా నిలిచాయి. ప్రజల సహకారంతోనే ఏజెన్సీలో అధిక శాతం పన్నుల వసూలు పూర్తి చేశామని కొత్తగూడ ఎంపీవో పద్మ పేర్కొన్నారు.

# రెండు పడక గదుల ఇళ్లకు రాజకీయ గ్రహణం



పెద్దపల్లి : రెండు పడకల గదుల ఇళ్లకు 'రాజకీయ' గ్రహణం ఏర్పడటంతో గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన లబ్ధిదారులు ప్రయాసపడుతున్నారు. డబుల్ బెడ్ రూమ్‌ల మంజూరుపై గత ప్రభుత్వం లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి పంపిణీలో తాత్సారం చేసింది. ఇంతలో ఎన్నికలు రావడం.. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో వీటి పంపిణీపై మళ్లీ అనిశ్చితి నెలకొంది.

**మొత్తం 3299 గృహాల కేటాయింపు**

కాంగ్రెస్ ప్రభుత్వం వీటి పంపిణీ, అసంపూర్తి ఇళ్ల నిర్మాణంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. జిల్లావ్యాప్తంగా మొత్తం 3,299 ఇళ్లు కేటాయించారు. గత ఏడాది జనవరి 23న మాజీ మంత్రి ఈశ్వర్ చేతుల మీదుగా మంథని పట్టణంలోని పోచమ్మవాడలో రూ.5.78 కోట్లతో 92 ఇళ్లలో 74 ఇళ్లను లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన 3,225 ఇళ్లలో 1,858 ఇళ్లు పూర్తయినప్పటికీ రహదారులు, కాలువలు, ఇతర మౌలిక వసతులు కల్పించలేదు. ఇంకా 1,367 ఇళ్లు అసలు నిర్మాణానికే నోచుకోకపోవడం గమనార్హం. మిగిలిన చోట్ల 13,683 దరఖాస్తులు రాగా నియోజకవర్గానికి 100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక మాత్రమే చేశారు. మౌలిక వసతులు లేకపోవడంతో ఎన్నికల అనంతరం పంపిణీ చేస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు దాటవేశారు. పెద్దపల్లి, రామగుండం ప్రాంతాల్లో రిజర్వేషన్ల ప్రాతిపదికన లక్కీడ్రా ద్వారా ఎంపికైన వారికి టోకెన్లు ఇచ్చి చేతులుదులుపుకొన్నారు. కాల్వశ్రీరాంపూర్, మల్యాపూర్, కూచిరాజ్‌పల్లి వంటి చోట్ల ఇప్పటికీ నిర్మాణాలూ కొనసాగుతున్నాయి.

లబ్ధిదారుల ఎంపికపై ఫిర్యాదుల వెల్లువగత ప్రభుత్వ హయాంలో అధికారికంగా లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన సమయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్ల సంఖ్య, ఎంపికైన లబ్ధిదారుల సంఖ్యకు చాలా తేడాలు వచ్చా యి. రామగుండం, పెద్దపల్లి, మంథని ప్రాంతాల్లో అప్పటి ప్రజాప్రతిని ధులు తమ కార్యకర్తలకే, అనర్హులకే ఇళ్లు కేటాయించారంటూ పలువురు ఇటీవలే ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. సైతం ఇళ్ల కోసం దరఖాస్తు చేసి ఎంపిక కానివారు ఆందోళనలు వ్యక్తం చేశారు. గతంలో ఎంపికైన లబ్ధిదారుల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్వేలు చేసి వాస్తవ పరిస్థితులు పరిశీలించాకే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో ప్రస్తావించింది. గతంలో ఎంపికైన లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

# బోగస్ కార్డుల ఏరివేత షురూ



హుజూరాబాద్ : ఉమ్మడి జిల్లాలో బోగస్ రేషన్ కార్డు ఏరివేత ప్రక్రియ షురూ అయ్యింది. చనిపోయిన వారు, స్థానికంగా నివాసముండని వారి కార్డులను రద్దు చేయడంతో పాటు వాటిలోని లబ్ధిదారుల పేర్లను తొలగించారు. ఏరివేత తర్వాత మిగిలిన రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులకు అనుగుణంగా ఈ నెల బియ్యం కోటాను కేటాయించారు. దీంతో వేలాది క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వానికి మిగులుబాటు అయ్యింది.

ఇదీ పరిస్థితి.. ఒక్కో వ్యక్తి పేరిట ఆరు కిలోల చొప్పున రేషన్ కార్డుల్లోని కుటుంబ సభ్యులందరికి బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. కొత్త కార్డులు జారీ చేయకపోవడం, ఏళ్ల తరబడి పాత వాటినే కొనసాగించడంతో స్థానికంగా లేనివారు, చనిపోయిన వారు, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పేరిట కూడా ప్రతినెలా బియ్యం పంపిణీ అవుతోంది. దీనికితోడు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను వినియోగించుకుంటున్నారు. ఈ అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం బయోమెట్రిక్, ఐరిస్ విధానాన్ని అమలు చేసినప్పటికీ బోగస్ లబ్ధిదారులను గుర్తించడం కష్టంగా మారింది. దీనికి ప్రధాన కారణం రేషన్ కార్డుల్లోని ఎవరైనా సభ్యుడు ఒకరు డీలర్ వద్దకు వెళ్లి వేలిముద్ర వేస్తే సభ్యులందరికీ బియ్యం పంపిణీ చేసే వెసులుబాటును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయి. దీన్ని ఆసరాగా చేసుకొని అనర్హులు సైతం బియ్యం తీసుకునే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వాలు బోగస్ లబ్ధిదారులను గుర్తించి వారి పేర్లను తొలగించకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది క్వింటాళ్ల బియ్యం దుర్వినియోగం అవుతోంది. అనర్హులు రేషన్ కార్డులు కలిగి ఉండటంతో డీలర్ల వద్ద బియ్యం తీసుకుని నేరుగా ప్రయివేటు దళారులకు విక్రయిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 1,081 కార్డుల రద్దు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వం బోగస్ కార్డుల ఏరివేతపై ప్రత్యేక దృష్టి సారించింది. బోగస్ కార్డుల వివరాలు ఇవ్వాలని గత నెలలో పౌరసరఫరాల సంస్థ ఆదేశించడంతో స్థానికంగా లేని వారు, చనిపోయిన వారి వివరాలతో కూడిన నివేదికను రేషన్ డీలర్లు అందజేశారు. దీని ఆధారంగా లబ్ధిదారులకు చెప్పకుండానే ఉమ్మడి జిల్లాలోని 1,081 రేషన్ కార్డులను రద్దు చేసింది. ఈ కార్డుల్లో సభ్యులుగా ఉన్న 4,364 మందికి బియ్యం కట్ చేసింది. తద్వారా 25.193 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి మిగులుబాటు అయ్యింది. ఉమ్మడి జిల్లాలో గత ఫిబ్రవరిలో 9,78,595 రేషన్‌కార్డులు ఉండగా, ఇందులోని 28,13,384 మంది సభ్యులకు 17,963.514 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయించింది. అదే ఈ నెలలో 9,77,514 రేషన్‌కార్డుల్లోని 28,09,020 మంది సభ్యులకు 17,938.321 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. అత్యధికంగా కరీంనగర్ జిల్లాలోనే 1,035 రేషన్‌కార్డులు రద్దయ్యాయి. జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల డీలర్లు ఇంకా బోగస్ లబ్ధిదారుల వివరాలను పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో ఏరివేత ప్రక్రియ ఇంకా మొదలుకాలేదు.

అప్పుడే కొత్తవి జారీ బోగస్ రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియ పూర్తయిన తర్వాతే కొత్త కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2021 జూన్ వరకు 1,10,139 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోగా అవి వివిధ దశల్లో ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 1.40 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటి ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతమున్న రేషన్ కార్డుల్లో ప్రతినెలా దాదాపు 15 శాతం మంది బియ్యం తీసుకోవడం లేదని, వీరిలో కొందరు ఒక నెల తీసుకుంటూ మరో నెల వదిలేస్తున్నారు.

# మళ్లీ ముప్పు తప్పదా?



వరంగల్ : నగరానికి వచ్చే వర్షాకాలంలో ముంపు ముప్పు తప్పేలా లేదు. గతేడాది జులై చివర్లో వరంగల్ పోతననగర్ వైపు భద్రకాళి చెరువు కట్టకు బుంగ పడటంతో ఓరుగల్లు నగరం గజగజ వణికింది. పోతననగర్, రంగంపేట, సరస్వతి కాలనీ, భద్రకాళి ఆలయం రోడ్డులో నివాసాలను ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఖాళీ చేయించారు. అదృష్టం కొద్దీ నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో గండం గట్టెక్కింది. ఆ సమయంలో చెరువు నీళ్లు బయటకు వెళ్లకుండా తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఇంత వరకు పోతననగర్ వైపు భద్రకాళి చెరువు కట్ట వద్ద శాశ్వత పనులు చేపట్టలేదు. ఇప్పటికే లీకేజీతో నీళ్లు బయటకొస్తున్నాయి. గ్రేటర్ వరంగల్, ఇరిగేషన్ శాఖలు మేల్కొనక పోతే వచ్చే వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉన్నట్లే.

డౌన్ స్ట్రీమ్ షట్టర్లు ఎక్కడ..హంటర్ బొందివాగు నాలా వరదనీటిని భద్రకాళి చెరువులోకి మళ్లించడం, వరంగల్ పోతననగర్, హనుమకొండ కాపువాడ మత్తడిల వైపు డౌన్ స్ట్రీమ్ ఫ్వలింగ్ షట్టర్లు ఏర్పాటు చేసేందుకు ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు డిజైన్ చేశారు. సుమారు రూ.163 కోట్లతో పనులు ప్రతిపాదించారు. గత భారాస ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. టెండర్ కూడా పూర్తయినట్లుగా తెలిసింది. ఇంత వరకు క్షేత్రస్థాయిలో పనులు మొదలుకాలేదు. తెలంగాణలో ప్రభుత్వం మారడంతో బొందివాగు నాలా ప్రాజెక్టు పనులపై సందేహాలు నెలకొన్నాయి. వరంగల్ పోతననగర్ భద్రకాళి చెరువు మత్తడి వద్ద వంపుగా ఉంటుంది. భద్రకాళి బండ్ అభివృద్ధి పనుల్లో భాగంగా పాత చెరువు కట్ట కూలింది. ఎనిమిది నెలలవుతున్నా చెరువు కట్ట బలోపేతం, డౌన్ స్ట్రీమ్ ఫ్వలింగ్ షట్టర్లు ఏర్పాటు చేయాలి. భారీ వర్షాలు పడితే వరదనీరు పోటెత్తే అవకాశాలున్నాయి.

**ప్రమాదకరంగా వంతెనలు..**

గతేడాది జులై నెలలో వరదలు వరంగల్ నగరాన్ని ముంచెత్తాయి. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 200 కాలనీలు నీటమునిగాయి. వారం రోజుల పాటు జనజీవనం స్తంభించింది. రూ.కోట్ల నష్టం వాటిల్లింది. చాలాచోట్ల పాతకాలం నాటి వంతెనలు, కాజ్ వేలు కొట్టుకుపోయాయి. వీటిపై తక్షణం దృష్టి పెట్టాలి.

గతేడాది వరంగల్ రంగంపేట కూడలి భద్రకాళి దేవాలయానికెళ్లే ప్రధాన రోడ్డు వంతెన అయిదారు రోజుల పాటు నీటమునిగింది. వంతెనల చుట్టూ రెయిలింగ్ పూర్తిగా కొట్టుకుపోయింది. ఇంత వరకు కొత్తవి ఏర్పాటు చేయలేదు. రహదారి మునగకుండా వంతెన ఎత్తు పెంచాలని ప్రతిపాదించారు. ఇంత వరకు వీటి ఊసే లేదు.

హనుమకొండ బొక్కలగడ్డ, గోపాల్‌పూర్ పాత కాలం నాటి వంతెనలు వరదనీటికి దెబ్బతిన్నాయి. జవహర్‌నగర్, నయీంనగర్ వద్ద పాత వంతెనలకు పగుళ్లు వచ్చాయి. వీటి స్థానంలో కొత్తవి ప్రతిపాదించారు. ఇంత వరకు పనులు ప్రారంభించలేదు.

# ప్లాస్టిక్ ముప్పు.. ఎవరిదీ తప్పు?

భూపాలపల్లి : జిల్లా కేంద్రం భూపాలపల్లి పురపాలిక పరిధిలో రోజుకు 7 ట్రాక్టర్లు, 12 స్వచ్ఛ అటోల ద్వారా దాదాపుగా 14 టన్నుల వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వీటిలో సింహభాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. దీనికి తోడు పట్టణంలోని పలు కాలనీల్లోని మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళు ఇతరత్రా వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు ముందుకు సాగకపోవడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పట్టణంలో ఏ వీధి చూసినా దుర్వాసన రావడం, దోమలు, పందుల స్వైర విహారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డు మార్గంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో, సంతోషిమాత ఆలయం సమీపంలో, అంబేద్కర్ కూడలి ప్రాంతంలోని సినిమా థియేటర్ వెనుక భాగంలో, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ దగ్గర, సంఘమిత్ర డిగ్రీ కళాశాల ఎదురుగా, శ్రీ చైతన్య పీజీ కళాశాల తదితర ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను కుప్పలుగా పోసి నిప్పుపెడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు, పారిశుద్ధ్య సిబ్బంది అనునిత్యం కాలబెడుతున్నారు. పట్టణంలోని సీఆర్ నగర్ ప్రాంతంలోని డంపింగ్ యార్డులో నిత్యం ప్లాస్టిక్‌తో పాటు చెత్తాచెదారాన్ని కాలుస్తుండటం వల్ల సమీపంలోని అడవులకు ముప్పు ఏర్పడుతుంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

**జాడలేని తనిఖీలు..**

ప్రస్తుత పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా ప్లాస్టిక్ నిర్మూలనలో విఫలమవుతోంది. అధికారులు సైతం నిషేధిత ప్లాస్టిక్‌ను వాడితే జరిమానాలు, సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామని చెబుతున్నారే తప్ప ఆచరణలో అమలు చేయకపోవడంతో దీని వినియోగం పెరిగిపోతోంది. పట్టణంలో ఏ దుకాణంలో చూసినా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కుప్పలు తెప్పలుగా విక్రయిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది అడపాదడపా తనిఖీలు చేసి దుకాణ యజమానులపై చర్యలు క్రమంలో కొందరు పాలకులే అడ్డుపడుతున్నారు. 2022లో వివిధ దుకాణాలపై ఏడు కేసులు పెట్టగా పాలకవర్గ కౌన్సిలర్లు తనిఖీలు చేయవద్దని సిబ్బందిని బెదిరించి, సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను మరలా అదే దుకాణదారులకే ఇచ్చేశారు. దీంతో పురపాలక సిబ్బంది ప్లాస్టిక్‌పై తనిఖీలు చేయాలనే విషయాన్నే పూర్తిగా మరిచిపోయారు. గడిచిన నాలుగేళ్లలో నాలుగైదు సార్లు మాత్రమే తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు తగు చర్యలు తీసుకునేలా దృష్టి సారించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

# అర్ధరాత్రి తోడేస్తున్నారు!

మహబూబాబాద్ : జిల్లాలో ఇసుక అక్రమానికి అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పలు ప్రయత్నాలు చేస్తున్నా అడ్డుకట్ట వేయలేకపోతోంది. ఒకప్పుడు పగటిపూట తవ్వించినవారు ప్రస్తుతం అర్ధరాత్రి వాగుల నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో వాగుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. పరివావాక ప్రాంతాల్లోని పొట్టదశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి. తవ్వకాలు ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో తాగునీటికి ప్రజలు అల్లాడే పరిస్థితులు నెలకొన్నాయి.

**తెల్లవారుజాము వరకు**

కొన్ని చోట్ల రాత్రి 9 నుంచి, ఇంకొన్ని చోట్ల అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఈ సమయంలో అధికారులు పట్టుకోరనేది అక్రమార్కుల ఆలోచన. ఒకప్పుడు 300 ట్రాక్టర్లలో ఇసుక రవాణా జరిగేది. నిఘా పెరగడంతో జిల్లాలో సుమారు 60 ట్రాక్టర్ల ద్వారా రవాణా అవుతోంది. ఒక్కో ట్రాక్టరులో 3 క్యూబిక్ మీటర్ల ఇసుక పడుతుంది. ఈ లెక్కన 60 ట్రాక్టర్ల ద్వారా 180 క్యూబిక్ మీటర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

**సిబ్బంది చేతివాటం**

పోలీసు అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేస్తుంటే కింది స్థాయి సిబ్బంది మాత్రం 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఇసుక ట్రాక్టర్లను ఆపి ఉన్నతాధికారి లేనప్పుడు సిబ్బంది డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇవ్వని వారిని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

నర్సింహులపేట మండలం కొమ్ములవంచ సమీపంలోని ఆకేరు వాగు నుంచి రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా అవుతోంది. జయపురం, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం పరిధిలో ప్రవహిస్తోంది. రోజూ 20 ట్రాక్టర్లు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామువరకు రవాణా కొనసాగిస్తున్నాయి.

**రాజకీయ నాయకుల ఒత్తిడి**

ప్రస్తుతం అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేయకముందే వాటిని స్టేషన్ నుంచి బయటకు పంపిస్తున్నారు. ఇందుకు రాజకీయ నాయకుల ఫోన్ల ఒత్తిడి కారణమని తెలుస్తోంది.

**అధిక ధరలకు విక్రయం**

గతంలో ఒక్కో ట్రిప్పు ఇసుకను రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు విక్రయించేవారు. ఇప్పుడు అధికారులు అడ్డుకుంటున్నారనే సాకుతో ఆకేరు వాగులోని ఒక ట్రిప్పునకు రూ.7 వేల వరకు తీసుకుంటున్నారు. మిగిలిన చోట్ల రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు.

**ఈ ప్రాంతాల నుంచే అధికంగా..**

నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం, బ్రాహ్మణకొత్తపల్లి, నెల్లికుదురు, మునిగలవీడు గ్రామాల శివారులోని ఆకేరు వాగు నుంచి అర్ధరాత్రి రవాణా కొనసాగుతోంది. రోజుకు పది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు.

గూడూరు మండలం కొల్లాపురం శివారులోని మున్నేరు వాగును కూడా వదలిపెట్టడం లేదు. తవ్వకాలతో రాళ్లు తేలుతున్నాయి. నీరు నిల్వ ఉండడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దంతాలపల్లి మండలం వేములపల్లి, దోనకొండ గ్రామాల సమీపంలో పాలేరు వాగు ఉంది. కొద్ది రోజుల నుంచి తవ్వకాలు జోరందుకున్నాయి. రోజుకు పది ట్రాక్టర్ల ద్వారా అర్ధరాత్రి మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు ఇసుకను రూ.4500 చొప్పున అమ్ముతున్నారు.

బయ్యారం మండలం కాచనపల్లి సమీపంలోని పెద్దవాగు వద్ద చీకటి పడగానే ట్రాక్టర్లు రోడెక్కుతున్నాయి. ప్రతి రోజు 15 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సింహులపేట ఎస్సై గండ్రాతి సతీష్ పేర్కొన్నారు. ఆకేరు వాగులో ఇసుక తరలించకుండా ట్రెంచ్‌లు కొట్టామన్నారు. వాటిని పూడ్చి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.




రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కారు ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. 'గోదావరి మాతకు ప్రణామాలు.. ఈ నేల మీదే ఆదికవి నన్నయ్య తొలి కావ్యం రాశారు. ఇక్కడి నుంచే ఇప్పుడు కొత్త చరిత్ర లిఖించబోతున్నాం' అంటూ మోదీ తెలుగులో తన ప్రసంగం ప్రారంభించారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "వైకాపా ప్రభుత్వం అవినీతిని జెట్ స్పీడ్‌తో పరిగెత్తించింది. అభివృద్ధి సున్నా.. అవినీతి వందశాతం. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని పూర్తిగా తిరస్కరిస్తారు. రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే ప్రభుత్వం ఉండాలి. వైకాపా సర్కారు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఈ రాష్ట్రం ప్రతిభావంతులైన యువతకు నెలవు. టెక్నాలజీలో ఏపీ యువత శక్తిని ప్రపంచం గుర్తించింది. దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో రాష్ట్రం కూడా అంతే స్పీడ్‌తో అభివృద్ధి చెందాలి. కానీ, కేంద్ర ప్రాజెక్టుల అమలును రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేసింది. డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు పూర్తి అప్రమత్తంగా ఉండాలి.

పదేళ్ల క్రితం దేశాన్ని కాంగ్రెస్ పార్టీ అధోగతి పాలు చేసింది. ఈడీ.. ఈడీ.. అంటూ ఇండియా కూటమి గగ్గోలు పెడుతోంది. కాంగ్రెస్ నేతల వద్ద గుట్టల కొద్దీ డబ్బు బయట పడుతోంది. ఆ పార్టీ నేతల డబ్బును మెషీన్లు కూడా లెక్కపెట్టలేకపోతున్నాయి"

**మూడు రాజధానుల పేరిట ఏపీని లూటీ చేశారు..** "మూడు రాజధానులు చేస్తామన్నారు.. చేయలేదు కానీ, మూడు రాజధానుల పేరిట ఏపీని లూటీ చేశారు. ఏపీలో మద్యం నిషేధిస్తామని అధికారంలోకి వచ్చిన వైకాపా.. గద్దె నెక్కిన తర్వాత మద్యం సిండికేట్‌గా తయారైంది. వైకాపా ప్రభుత్వానికి అవినీతి నిర్వహణ తప్ప.. రాష్ట్ర ఆర్థిక నియంత్రణ తెలియదు. రాష్ట్ర ఖజానాను వైకాపా ఖాళీ చేసింది. పోలవరం కోసం కేంద్రం రూ.15వేల కోట్లు ఇచ్చింది. కానీ, ఆ ప్రాజెక్టును ఈ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. రైతుల ఆశలపై వైకాపా ప్రభుత్వం నీళ్లు చల్లింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలవరం సహా ఏపీ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. రాజధానికి కేంద్రం రూ.15వేల కోట్లు ఇవ్వాలనుకుంది. కానీ, కేంద్రం నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందుకోలేక పోయింది. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక చరిత్ర ఉన్న భూమి. రాముడి చరిత్రను సినిమాల ద్వారా ఎన్టీఆర్ ఇంటింటికీ తీసుకెళ్లారు. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠను కాంగ్రెస్ బహిష్కరించింది. ఆ కార్యక్రమానికి వచ్చిన ఒక నేతను కాంగ్రెస్ బహిష్కరించింది. దిల్లీ-ముంబయి కారిడార్ మాదిరి విశాఖ-చెన్నై కారిడార్ నిర్మాణం చేపడతాం. విశాఖ-చెన్నై కారిడార్‌తో కాకినాడ పోర్టుకు సరకు రవాణా సులభతరం అవుతుంది. చెన్నై-కోల్‌కతా హైవే, రాజమహేంద్రవరం విమానాశ్రయం ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మారుస్తాయి. ఏపీకి మోదీ గ్యారంటీ, చంద్రబాబు నేతృత్వం, పవన్ విశ్వాసం ఉన్నాయి. కూటమి అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కూటమికి ఓటేయండి " అని మోదీ విజ్ఞప్తి చేశారు.






## పవన్‌తో పాటు మెగా ఫ్యామిలీపై ముద్రగడ సంచలన వ్యాఖ్యలు

కాకినాడ: వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో పాటు మెగా ఫ్యామిలీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన నివాసానికి రాలేదని ఆగ్రహం తెచ్చుకున్న ముద్రగడ.. ఆ పార్టీలో చేరే విషయమై మనసు మార్చుకుని ఆ తరువాత వైసీపీలో చేరి పవన్‌పై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆ వ్యాఖ్యలు ఆయన కూతురు క్రాంతి భారతికే నచ్చడం లేదు. దీంతో ముద్రగడ కూతురు మీడియా ముందుకు వచ్చి మరీ తన తండ్రి వైసీపీ అధినేత జగన్ ఆడిస్తున్నట్టు ఆడుతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను గెలిపించాలంటూ పిలుపునిచ్చారు. దీంతో ముద్రగడకు తన కూతురిపై విపరీతమైన కోపం వచ్చింది. అంతేకాకుండా తన కూతురు తనకు వ్యతిరేకమవడానికి తన వ్యవహార శైలి కారణమన్న విషయాన్ని పక్కనబెట్టి పవన్‌తో పాటు మెగా ఫ్యామిలీపై సైతం ముద్రగడ నోరు పారేసుకున్నారు. పవన్ తన కూతురిని అనుకూలంగా మార్చుకున్నారని.. ఆయన తన ముగ్గురి భార్యలను పరిచయం చేయగలరా? అని ప్రశ్నించారు. తనకు కానీ.. తన కుటుంబ సభ్యులకు కానీ ఏ మి జరిగినా తన ఇంటికి తన కూతుర్ని పంపించవద్దని చెప్పారు. అలాగే వస్తానని అనకని తన కూతురుకు సైతం చెప్పారు. మెగా ఫ్యామిలిలో ఎవరు పబ్బుల్లో తిరుగుతున్నారు? ఎవరు ఎవరితో ఉంటున్నారో బయటకు చెప్పాలన్నారు.పవన్ మీ ఇంటికి వస్తానని చెప్పారని మీడియా చెప్పగా.. నో ఎంట్రీ అని ముద్రగడ సమాధానం చెప్పారు.


# పెన్షనర్ల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే..



న్యూఢిల్లీ, మే 6: పెన్షనర్లకు సకాలంలో పెన్షన్లు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తున్నారని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారని.. ఇది దుర్మార్గమైన చర్య అంటూ మండిపడ్డారు. పెన్షనర్లు అనేక మంది మృతి చెందారని.. పెన్షనర్ల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే అని వ్యాఖ్యలు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసంఇంతమందిని బలి చేశారన్నారు. ఉద్యోగులు ఓటు కూడా వినియోగించుకొలేని పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగులు 95 శాతం ఎన్డీయే కూటమికి ఓట్లు వేసే వారే అని తెలిపారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు ఉద్యోగుల సిద్ధంగా ఉన్నారన్నారు. ఉద్యోగులను ఎంత ఇబ్బంది పెడుతున్నారో అర్థమైందన్నారు. రాష్ట్రంలో కొందరు అధికారులు ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తున్నారని విమర్శించారు. "ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న. గతంలో రాజశేఖర్ రెడ్డికి సహకరించిన కొందరు ఐఏఎస్ అధికారులు కోర్టుల చుట్టూ తిరగడం చూశాము. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు అధికారులు అడ్డగోలుగా పని చేశారు" అంటూ మాజీ ఎంపీ విమర్శించారు.

**సీఎస్ రాజీనామా చేయాల్సిందే...** డీజీపీని ఎన్నికల నిర్వహణ నుంచి పక్కకు తప్పించారన్నారు. వైసీపీ కోసం కొందరు అధికారులు అధికార దుర్వినియోగం చేశారని అనడానికి ఇది నిదర్శనమన్నారు. ప్రజలు ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేలా చేయాలని తెలిపారు. అధికారులు ప్రలోభాలకు గురి అవ్వొద్దని కోరారు. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఐఏఎస్ అధికారులకు స్వేచ్ఛ, గౌరవం ఉండేదని.. జగన్ లాగా చంద్రబాబు అధికారులను ఇబ్బందులకు గురి చేయలేదని చెప్పుకొచ్చారు. ఐఏఎస్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. చీఫ్ సెక్రటరీ పెన్షనర్ల విషయంలో దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. పెన్షనర్ల మరణాలకు చీఫ్ సెక్రటరీ కూడా బాధ్యత వహించాలన్నారు. చీఫ్ సెక్రటరీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఈసీ సమయానికి స్పందించి చీఫ్ సెక్రటరీని ఎన్నికల విధుల నుంచి తప్పియాలన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ కూడా ల్యాండ్ టైటిల్ యాక్ట్ బాధితుడేనని వాపోయారని కనకమేడల రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.

విశాఖ: రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని విశాఖ తూర్పు టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణ బాబు అన్నారు. మత్స్యకారులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులను ఐదేళ్లుగా వైసీపీ మోసం చేసిందని విమర్శించారు. మత్స్యకారులకు టీడీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని గుర్తు చేశారు. టిడ్కో ఇళ్లను టీడీపీ నిర్మిస్తే వాటిని అర్హులకు ఎందుకు ఇవ్వలేదని వెలగపూడి ప్రశ్నించారు. వైపీపీ ప్రభుత్వానికి మరో వారం రోజుల సమయం ఉందనీ రామకృష్ణ బాబు వ్యాఖ్యానించారు.






## ఒకరికొకరు ఎదురైన కూటమి అభ్యర్థి, వైసీపీ అభ్యర్థి.. నవ్వుతూ కరచాలనం.. ఎక్కడంటే?

పశ్చిమగోదావరి, మే 6: ఎన్నికల ప్రచారంలో అప్పుడప్పుడు కొన్ని కొన్ని విచిత్ర సంఘటనలు.. అరుదైన ఘటనలు చోటు చేసుకుంటుంటాయి. సాధారణంగా ఈ సమయంలో అభ్యర్థుంతా ఎవరికి వారే విడివిడిగా, వడివడిగా ఎన్నికల ప్రచారం సాగిస్తుంటారు. ఈ తరుణంలో ఆయా పార్టీల అభ్యర్థులు సాధారణంగా ఒకచోట కలుసుకోరు. అనుకోని పరిస్థితుల్లో అభ్యర్థులు ఒకరికి ఒకరు ఎదురైనప్పటికీ అవి ఘర్షణలకే దారి తీస్తుంటాయి. అభ్యర్థుల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటనలు ఎన్నో చూశాం. కానీ పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం అందుకు వ్యతిరేకంగా సీన్ జరిగింది. కూటమి అభ్యర్థి, వైసీపీ అభ్యర్థి ఎదురైనప్పటికీ ఎలాంటి బేషజాలకు పోకుండా ఒకరినొకరు పలకరించుకున్నారు. సోమవారం ఉదయం పాలకొల్లు సమీపం ఉల్లంపర్రు గ్రామంలో కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస వర్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో అనుకోకుండా కూటమి అభ్యర్థికి వైసీపీ అభ్యర్థి గూడూరు ఉమాబాల ఎదురయ్యారు. దీంతో వారు ఇరువురు నవ్వుతూ కరచాలనం చేసుకుని కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ సాక్షిగా జరిగిన ఈ సంఘటనతో ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# ఏపీ నూతన డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా




అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా 1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హరీశ్‌కుమార్ గుప్తాను ఎన్నికల సంఘం నియమించింది. తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా సీఎస్ జవహర్‌రెడ్డికి సమాచారం అందించింది. ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌పై ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతన డీజీపీ పోస్టులో నియమించేందుకు ముగ్గురు పేర్లతో కూడిన ప్యానెల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఈసీకి పంపింది. సీనియార్టీ జాబితాలో ఉన్న ఐపీఎస్ అధికారులు ద్వారకా తిరుమలరావు (ఆర్టీసీ ఎండీ ), మాదిరెడ్డి ప్రతాప్, హరీశ్‌కుమార్ గుప్తా పేర్లను సిఫార్సు చేయగా హరీశ్‌కుమార్ గుప్తాను ఈసీ ఎంపిక చేసింది.




అమరావతి: వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్'పై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తానూ ఇబ్బందులు పడ్డానని విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో #LandTitlingAct హ్యాష్ ట్యాగ్‌తో ఆయన పోస్ట్ చేశారు. "నేను ప్రత్యక్ష బాధితుడిని. కృష్ణా జిల్లా విన్నకోట గ్రామంలో చనిపోయిన నా తల్లిదండ్రుల పట్టా భూములను మ్యుటేషన్ చేసేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరించారు. తహసీల్దార్ నా దరఖాస్తును తిరస్కరించారు. ఆర్డీవో పోస్ట్ ద్వారా పంపిన పత్రాలను తెరవకుండా తిరిగి ఇచ్చేశారు. చట్టం అమలులోకి రాకముందే నా తల్లిదండ్రుల భూములపై నాకు హక్కులు నిరాకరించబడుతున్నాయి. ఐఏఎస్ అధికారిగా 36 ఏళ్ల పాటు ఆంధ్రప్రదేశ్‌కు సేవలందించిన నా పరిస్థితే ఇలా ఉంటే.. సామాన్య రైతుల దుస్థితిని ఊహించలేం" అని పీవీ రమేశ్ పేర్కొన్నారు.




కడప: తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును సీబీఐ ఛార్జిషీట్‌లో పెట్టించిన వారికి ఏఏజీ పదవి ఇచ్చారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వివేకా హత్య కేసుపై మాట్లాడుతూ జగన్ అధికారంలో లేనప్పుడు సీబీఐ విచారణ కావాలని అడిగారని గుర్తుచేశారు.

అధికారంలోకి రాగానే ఎందుకు వద్దన్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్‌ను చూసుకునే తెలంగాణ నేత రాఘవరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రూ.వెయ్యి కోట్లు తీసుకున్నట్లు రుజువులు ఉంటే బయటపెట్టాలన్నారు. ఇటీవల కడప ఎంపీ అవినాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల పైనా షర్మిల స్పందించారు. తన భర్త అనిల్ కుమార్ భాజపా నేతను ఎక్కడా కలవలేదు.. కలవరని చెప్పారు. అవినాష్ మాదిరి అర్ధరాత్రి గొడ్డలి రాజకీయాలు తమకు తెలియదని ఎద్దేవా చేశారు.

"కంటికి కనిపించని పొత్తును జగన్ కొనసాగిస్తున్నారు. క్రైస్తవులపై దాడి ఘటనలో కూడా వైకాపా స్పందించలేదు. అదానీ, అంబానీలకు ప్రభుత్వ ఆస్తులను సీఎం దోచిపెట్టారు. జగన్ భాజపా దత్తపుత్రుడని నిర్మలా సీతారామన్ చెప్పారు. మోదీ వారసుడిగానే ఆయన ఉన్నారు.. వైఎస్సార్ వారసుడిగా కాదు.

వైకాపా ఇంత అవినీతిలో కూరుకుపోయినా భాజపా ఎందుకు చర్యలు తీసుకోలేదు?. జగన్ ఆ పార్టీకి దత్తపుత్రుడు, తొత్తు కాబట్టే చర్యలు తీసుకోలేదు" అని షర్మిల విమర్శించారు.




పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లను సైతం జగన్ మూయించారని ప్రముఖ నటుడు, కూటమి తరపున ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ విమర్శించారు. శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్‌లను కొనసాగిస్తుండగా.. ఏపీలో మాత్రం అన్న క్యాంటీన్‌లను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సంక్షేమాన్ని తెదేపా విస్మరించలేదని చెప్పారు.

గరుడ వార్త



# కంచె తీసిన అందాల ఆరబోత

మెగా హీరో వరుణ్ తేజ్ నటించిన 'కంచె' సినిమాతో మంచి గుర్తింపు దక్కించుకున్నముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. ఈ అమ్మడు అంతకు ముందు తెలుగు లో ఒకటి రెండు సినిమాలు చేసినా కూడా అవి పెద్దగా సక్సెస్ ని తెచ్చిపెట్టడం లో విఫలం అయ్యాయి. కంచె తో ఈ అమ్మడు బిజీ అయ్యింది. పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించిన ప్రగ్యా జైస్వాల్ సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉ



ంది. తాజాగా మరోసారి ఆకట్టుకునే అందంతో ఈ అమ్మడు అదరగొట్టింది. క్లీవేజ్ షో తో మతి పోగొట్టింది. సాధారణంగానే ప్రగ్యా అందాల ఆరబోత ఫోటోలు తెగ షేర్ చేస్తుంది. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా అందాల విందు తో సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తుంది. ఆకట్టుకునే అందాల ప్రగ్యా పోటోలు ఎప్పటిలాగే నెట్టింట వైరల్ అవుతూ ఈమె అందపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. అందుకే ఈమె ఎంతటి స్కిన్ షో చేసినా, చీర కట్టు లో కనిపించినా కూడా చూపు తిప్పుకోలేం అన్నంతగా ఆకట్టుకుంటూ ఉంది. మరోసారి ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఈ ఫోటోలతో సందడి చేస్తున్న ప్రగ్యా కి ఎందుకు ఆఫర్లు అంతగా రావడం లేదని నెటిజన్స్ కొందరు ఈ ఫోటోలు చూసిన తర్వాత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## అనుష్క కంటే ముందు విరాట్‌తో రెండేళ్లు ప్రేమలో?

విరాట్ కోహ్లీ- అనుష్క శర్మ జంట ప్రేమాయణం, పెళ్లి అంతా ఒక అందమైన కల. ఇప్పుడు ఈ జంటకు ఒక కుమార్తె కూడా ఉంది. వన్ ఫైన్ డే డెస్టినేషన్ వెడ్డింగ్ తో ఒకటయ్యే ముందు ఈ జంట షికార్లు నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లో నిలిచేవి. అయితే విరాట్ ఒక్కరితోనే డేటింగ్ చేసాడా? అనుష్కను ప్రేమించక ముందు ఎవరితోను డేటింగ్ చేయలేదా? అంటే దానికి సమాధానం ఇక్కడ ఉంది. బాలీవుడ్ ట్యాలెంటెడ్ గర్ల్ అనుష్క శర్మతో డేటింగ్ ప్రారంబించక ముందు విరాట్ మనసు దోచిన మరో అందగత్తె కూడా ఉంది. ఈ బ్యూటీ పేరు ఇజబెల్లా లైట్. ఈ విదేశీ అందగత్తెకు విరాట్ అత్యంత సన్నిహితుడు. బాలీవుడ్ స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా కూడా తనకు స్నేహితుడు అని ఇజబెల్లా పలుమార్లు వెల్లడించింది. కానీ ఆ ఇద్దరిలో ఎవరిని ప్రేమించింది? అనే విషయాన్ని కూడా ఓ ఇంటర్వ్యూలో ఓపెనైంది. పురాణీ జీన్స్‌లో తనూజ్ విర్వాణితో కలిసి నటించిన జాబెల్లె లైట్ అందానికి భారతీయులు ఫిదా అయిపోయారు. కాలక్రమంలో కరణ్ జోహార్ కాఫీ షోలో ఇజబెల్లా ప్రత్యక్షమైంది. విరాట్



తో స్నేహాన్ని ఈ బ్యూటీ ఖండించలేదు. అలాగే సిద్ధార్థ్ మల్హోత్రా స్నేహితుడు అని కూడా తెలిపింది. ఇప్పటికీ తాము కలుస్తుంటామని వెల్లడించింది. నా మగ స్నేహితుల మీద ఈ రకమైన శ్రద్ధ .. ఇప్పటికి మూడు అనుభవాలతో ముడిపడి ఉన్నాయి. కానీ నేను చాలా ఇబ్బందిగా భావిస్తున్నాను. నేను నా పని గురించి తప్ప ప్రతిచోటా కనిపించాలని వినిపించాలని కోరుకునే అమ్మాయిని కాదు... అని తెలిపింది. ఇజాబెల్లె తన జీవితంపై మీడియా అసత్యాలు రాసిందని వాపోయింది. మీడియాలోని కొన్ని వర్గాలు నా గురించి చాలా ఎక్కువ ప్రచారం చేసాయి. ఆ పుకార్లేవీ నిజాలు కావు... ఫరవాలేదులే... నేను ఈ వృత్తిలో ఉన్నాను. అక్కడ ప్రజలు నా జీవితం గురించి ఆసక్తిగా ఉంటారు. ఇది నా పనిలో భాగం కాబట్టి నేను అర్థం చేసుకున్నాను... అని అన్నారు. తొలి చిత్రం పురాణీ జీన్స్ సహనటుడు తనున్ విర్వాణితో లింక్-అప్ పుకార్లు కూడా ఉన్నాయి. కానీ వాటిని ఇజబెల్లే ఖండించింది. తనుజ్ నా సహనటుడు.. మేము పురాణి జీన్స్ కోసం వర్క్‌షాప్‌లను ప్రారంభించినప్పటి నుండి నిజంగా మంచి స్నేహితులం అయ్యాము. మేం ఎల్లప్పుడూ ఒకరినొకరు కలుస్తాము. అతని తల్లిదండ్రులు కూడా నాకు తెలుసు. వారు నాకు చాలా మంచి కుటుంబం వంటి వారు. అంతకు మించి ఏదీ లేదు అని తెలిపింది. క్రికెటర్ విరాట్ కోహ్లీతో డేటింగ్ చేస్తున్నట్టు ఇజాబెల్లె అంగీకరించింది. నేను ఇండియా వచ్చినప్పుడు నా మొదటి భారతీయ స్నేహితుల్లో విరాట్ ఒకడు. మేము చాలా కాలం పాటు డేటింగ్ చేసాము. దాదాపు రెండేళ్లు కలిసి ఉన్నాం. కానీ మేము దానిని పబ్లిక్ చేయదలచుకోలేదు. కాబట్టి విరాట్ తో నాకు సంబంధం ఉంది. కానీ సిద్ధార్థ్ నాకు స్నేహితుడు మాత్రమే.. మేం కలిసి సమయాన్ని కూడా గడుపుతాము... అని నిజాయితీగా మాట్లాడింది.





# కుందాపురం నుంచే కాంతార ఆట



'కాంతార' కి ప్రీక్వెల్ గా 'కాంతార-1' రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. మొదటి భాగం రిలీజ్ అయిన దగ్గర నుంచి రిషబ్ శెట్టి అండ్ కో స్క్రిప్ట్ పనుల్లోనే తలమునకలై ఉన్నారు. హొంబలే ఫిల్మ్స్ పాన్ ఇండియాలో భారీ బడ్జెట్ తో నిర్మించడనికి ముందుకు రావడంతో స్క్రిప్ట్ పై మరింత గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. తాజాగా స్క్రిప్ట్ లాక్ అవ్వడంతో రెగ్యులర్ షూటింగ్ కి వెళ్లడానికి రెడీ అవుతున్న ట్లు చిత్ర వర్గా లనుంచి తెలుస్తోంది. ప్రీ ప్రొడక్షన్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. వచ్చే వారం నుంచి మొదటి షెడ్యూల్ షూటింగ్ కి రంగం సిద్ధం చేస్తున్నారు. అందుకోసం ఇప్పటికే కుందాపురంలో భారీ సెట్ నిర్మించారు. కుందాపురంతో పాటు చుట్టు పక్క ఫారెస్ట్ ఏరియాలోనూ షూటింగ్ చేయనున్నారు. నైట్ సన్నివేశాల చిత్రీకరణ అంతా అక్కడే ఉంటుందని సమాచారం. సినిమాలో ఆసన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అంటున్నారు. 20 రోజుల పాటు అక్కడే కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారుట. ప్రస్తుతం ఈ సినిమా కోసం రిషబ్ శెట్టితో పాటు మరికొంత మంది నటులు కళరిపయట్టు..గుర్రపుస్వారీ కి సంబంధించి కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. ఈ కథని చెప్పడం కోసం రిషబ్ శెట్టి కొన్ని రకాల తాళ పత్ర గ్రంధాల్ని కూడా ఆధారంగా చేసుకుని కథ సిద్ధం చేసాడని వినిపిస్తుంది. వందేళ్ల పాటు ఉన్న కొంత మంది పాతతరం మనుషుల్ని కలిసినట్లు సమాచారం. ఆ సమాచారం ఆధారంగానే తన కథని వీలైనంత నేచురల్ గా చూపించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమా పై అంచనాలు ఎలా ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన 'కాంతార' 400 కోట్ల వసూళ్ళను సాధించింది. తెలుగులోనూ భారీ విజయం సాధించింది. దీంతో 'కాంతార' ప్రీక్వెల్ ప్రకటన మరింత ఇంట్రెస్టింగ్ గా మారింది. భూత కోలం కాన్సెప్ట్ ని మరింత లోతుగా ప్రీక్వెల్ లో చూపించనున్నారు.

# నారా రోహిత్ 'ప్రతినిధి 2' రణ యుద్ధం




నారా రోహిత్ కథానాయకుడిగా నటించిన 'ప్రతినిధి 2' వచ్చే వారం థియేటర్లలో విడుదల కానుంది. మేకర్స్ ఆ మేరకు అధికారికంగా విడుదల తేదీని ప్రకటించారు. వానరా ఎంటర్‌టైన్‌మెంట్స్ - రానా ఆర్ట్స్ బ్యానర్లపై కుమార్ రజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట - సురేంద్రనాథ్ బొల్లినేని సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం మే 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తపు (టీవీ 5 మూర్తి) ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సమ్మర్ హాలిడేస్ లో ఇది స్పెషల్ ట్రీట్ గా మారుతుందని టీమ్ భావిస్తోంది. 'ప్రతినిధి 2' టీజర్ - ట్రైలర్‌కు అద్భుత స్పందన వచ్చింది. గతంలో ఒక మాస్ పాటను విడుదల చేయగా వైరల్ గా దూసుకెళ్లింది. జీవితం గురించి జ్ఞానాన్ని ప్రసాదించేవాడిగా రోహిత్ ని ఈ పాటలో ఎలివేట్ చేసారు. రెండవ పాట- జర్నలిస్ట్ పై గీతం... ఆలోచింపజేసే పంక్తులతో కృష్ణకాంత్ రచించగా, స్వరాగ్ కీర్తన్ - జయంత్ పాడారు. ఈ పాటకు కూడా తక్షణం పాజిటివ్ స్పందన లభించింది. 'ప్రతినిధి' సిరీస్ లో ప్రతినిధి 2 రెండో చిత్రం. ఈ సినిమాలో నారా రోహిత్ నిజాయితీపరుడైన న్యూస్ రిపోర్టర్ పాత్రలో కనిపించనున్నాడు. సిరీ లెల్లా కథానాయికగా నటించగా, దినేష్ తేజ్, సప్తగిరి, జిషు సేన్‌గుప్తా, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నాని చమిడిశెట్టి లెన్స్‌మెన్, యువ సంచలనం మహతి స్వర సాగర్ సంగీతం అందించారు. దీనికి ఎడిటర్: రవితేజ గిరిజాల, కళ: కిరణ్ కుమార్ మన్నె.

# క్లోజప్ లో అందాల కృతి బేబీ

మోడలింగ్ నుంచి సినిమా రంగంలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ కృతి సనన్. ఈ అమ్మడు తెలుగు లో మొదటగా మహేష్ బాబుకు జోడీగా 1 నేనొక్కడినే సినిమాలో నటించింది. సుకుమార్ ఈ అమ్మడి పై చాలా నమ్మకం పెట్టుకుని సినిమాలో నటింపజేశాడు. ఆయన అంచనాలను కృతి అందుకుంది. ఆ సినిమా కమర్షియల్ గా నిరాశ పర్చడంతో ఆ తర్వాత ఎక్కువగా తెలుగు లో సినిమాల్లో ఆఫర్లు రాలేదు. దాంతో బాలీవుడ్ లో ఈ అమ్మడు ప్రయత్నాలు చేసింది. హిందీ ప్రేక్షకులు ఈ అమ్మడికి బ్రహ్మరథం పట్టారు. వరుసగా హిందీలో సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్ ఇమేజ్ ను సొంతం చేసుకుంది.



ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ని కలిగి ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసింది. ఈసారి క్లోజప్ లో ఉన్న తన పిక్ ను షేర్ చేసింది. కూల్ లుక్ లో ఏదో చదువుతూ ఫోటోకు ఫోజ్ ఇచ్చింది. అందాల కృతి భలే ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఆ మధ్య ఈ అమ్మడు ఒక తెలుగు సినిమాలో ఐటెం సాంగ్ చేయబోతుందనే వార్తలు వచ్చాయి. ఆ విషయమై క్లారిటీ రావాల్సి ఉంది.

## ఎన్టీఆర్ ప్లాన్స్ ఎలా ఉన్నాయంటే!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ తర్వాత ఏడాది గ్యాప్ తీసుకొని దేవర మూవీని సెట్స్ పైకి తీసుకొని వెళ్ళాడు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకి వచ్చింది. భారీ బడ్జెట్ తో ఈ మూవీ నిర్మాణం జరుగుతోంది. దేవర సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో తన మార్కెట్ ని పరీక్షించుకోవడానికి తారక్ రెడీ అవుతున్నాడు. తారక్ సినిమాల లైన్ అప్ చూసుకుంటే మొదటిగా దేవర మూవీ కనిపిస్తోంది. ఫిక్షనల్ జోనర్ లో కంప్లీట్ యాక్షన్ ప్యాక్డ్ కథతో ఈ సినిమా సిద్ధం అవుతోంది. ఈ సినిమా అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. రెండు భాగాలుగా దేవర తెరకెక్కుతూ ఉండగా అందులో మొదటి భాగం గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. దేవర మూవీ షూటింగ్ ఆగస్టు నాటికి కంప్లీట్ అవుతుందని తెలుస్తుంది. తారక్ హిందీలో వార్ 2 మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో



హృతిక్ రోషన్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. ఇండియన్ బిగ్ స్క్రీన్ పై అతిపెద్ద మల్టీస్టారర్ మూవీగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే తారక్ తన పోర్షన్ కి సంబంధించిన షూటింగ్ మొదలుపెట్టారు. సెప్టెంబర్ కి ఎన్టీఆర్ తనకు సంబంధించిన అన్ని సీక్వెన్స్ కంప్లీట్ చేస్తారంట. 2025 ఆగస్టు 14న వార్ 2 మూవీ పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. ఈ సినిమాతో తారక్ బాలీవుడ్ లో కూడా తనకంటూ మార్కెట్ క్రియేట్ చేసుకునే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీని తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ మూవీ స్టార్ట్ కానుంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. నవంబర్ లేదా డిసెంబర్ లలో ఈ మూవీ షూటింగ్ స్టార్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. ఇలా వరుసగా మూడు భారీ ప్రాజెక్టులను తారక్ చేతులు పెట్టుకు న్నారు. వీటి తర్వాత దేవర 2, ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ మూవీ సీక్వెల్ కూడా ఉంటాయని తెలుస్తోంది. అలాగే యష్ రాజ్ ఫిలిమ్స్ నుంచి తారక్ సోలోగా ఒక స్పై థ్రిల్లర్ మూవీ ఉండే అవకాశాలు ఉన్నాయని సమాచారం. సౌత్ ఇండియాలో మరి కొంతమంది స్టార్ డైరెక్టర్లు జూనియర్ ఎన్టీఆర్ తో సినిమాలు చేయడం కోసం లైన్ లో వెయిట్ చేస్తున్నారు.




## ఏపీ సీఎం జగన్ పరువు తీసేసిన కాంగ్రెస్ నాయకురాలు..

హైదరాబాద్, మే 05: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ పరువు తీసేశారు తెలంగాణ కాంగ్రెస్ నాయకురాలు రేణుక చౌదరి. జగన్ పరిపాలనా విధానాలపై సెటైర్లు గుప్పించారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడిన రేణుకా చౌదరి.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తొలుత తెలంగాణ అంశాలపై మాట్లాడిన ఆమె.. ఆ తరువాత ఏపీలో రాజకీయాంశాలపై కీలక కామెంట్స్ చేశారు. ఈ సందర్భంగా జగన్‌పై తనదైన శైలిలో పంచ్‌లు వేశారు.

ప్రధానంగా రాజధానుల అంశాన్ని ముందుకు తీసుకువస్తూ.. సీఎం జగన్ గాలి తీసేశారు. ఏపీకి జగన్ మూడు రాజధానులు ఏర్పాటు చేశారంటూ వ్యంగ్యంగా కామెంట్స్ చేశారు. ఆ మూడు రాజధాను ఇవేనంటూ.. వాటి పేర్లు కూడా చెప్పారు. ఇంతకీ ఆ మూడు రాజధానులు ఏంటో తెలుసా? రేణుకా చౌదరి ప్రకారం.. మూడు రాజధానుల్లో ఒకటి డ్రగ్స్ మరొకటి మర్డర్స్, మూడో రాజధాని నిరుద్యోగం అని.. వీటినే ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ఏర్పాటు చేశారని రేణుకా చౌదరి తనదైన శైలిలో మార్క్ సెటైర్స్ వేశారు.

**బీజేపీ సర్కార్‌పై ఫైర్..** అంతకు ముందు.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుపైనా రేణుకా చౌదరి తీవ్ర విమర్శలు చేశారు. ఏ అధికారంలో ఢిల్లీ పోలీసులు తెలంగాణలో దిగారని ప్రశ్నించారు. తెలంగాణ తడాఖా ఏంటో చూపిస్తామన్నారు. ఏ హక్కుతో గాంధీ భవన్‌కు వచ్చి తమ వాళ్లపై కేసులు పెడుతున్నారని కేంద్ర సర్కార్‌ను ప్రశ్నించారు. బీజేపీ వాళ్లకు దమ్ముంటే ప్రజల్ రేవణ్ణను పట్టుకోవాలని రేణుకా చౌదరి సవాల్ విసిరారు. నీరవ్ మోదీ, చాక్సీ పారిపోయినట్టే రేవణ్ణ పారిపోయాడని విమర్శించారు. ప్రజ్వల్‌ని బలపరిస్తే తనను బలపర్చినట్టేనని మోదీ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ నాయకులు ఇంత చేస్తుంటే ఎన్నికల అధికారులు సైలెంట్ గా ఉంటున్నారని విమర్శించారు. బ్రిజ్ భూషణ్ అన్ని అరాచకాలు చేస్తే మళ్ళీ ఆయనకే టికెట్ ఇచ్చారని విమర్శించారు. దేశంలో ఉన్న ముస్లింలకు మోదీ ప్రధాని కాదా? అని ప్రశ్నించారు. చైనా మన గడప తొక్కి ఇంట్లో ఉంటే మోదీ మాట్లాడడం లేదని విమర్శించారు. దొంగ సర్టిఫికెట్లు పెట్టుకొని పార్లమెంట్‌కి వస్తున్నారని.. జవాన్లు, రైతులు అనే రెండు పెద్ద సెక్యులర్ ఫోర్సెస్ దేశంలో ఉన్నాయన్నారు. పెద్ద ఛాతీ ఉండడం కాదు.. దానిలో గుండె, మనసు కూడా ఉండాలంటూ ప్రధాని మోదీకి చురకలంటించారు రేణుకా చౌదరి.

## రెండు పడక గదుల ఇళ్ల పేరుతో కేసీఆర్ మోసగించారు: జేపీ నడ్డా



పెద్దపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ నంబర్ వన్ అవుతుందని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఫార్మా, పెట్రో కెమికల్స్ రంగాల్లో దేశం రెండో స్థానంలో ఉందని తెలిపారు. పెద్దపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. గతంలో మొబైళ్లు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వాళ్లమని గుర్తుచేశారు. ప్రస్తుతం మేడిన్ ఇండియా ఫోన్లు వాడుతున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానంలో ఉందని చెప్పారు. దేశంలో 56 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించినట్లు నడ్డా వివరించారు. 52 వేల కిలోమీటర్ల మేర రైల్వే విద్యుదీకరణ చేసినట్లు తెలిపారు. "దేశంలో విమానాశ్రయాల సంఖ్య 148కి పెంచాం. లక్షలాది గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాం. 80 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ అందిస్తున్నాం. పేదలకు 4 కోట్ల ఇళ్లు కట్టించాం. మోదీ హయాంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. రాష్ట్రానికి వందేభారత్ రైలు సేవలు అందించాం. రెండు పడక గదుల ఇళ్ల పేరుతో కేసీఆర్ మోసగించారు. కేసీఆర్ హామీ ఇచ్చిన 2 పడక గదుల ఇళ్లు మేం పూర్తి చేస్తాం. ప్రధానమంత్రి ఆవాస్ యోజనను కేసీఆర్ ఉపయోగించుకోలేదు. ఇప్పుడు పీఎంఏవై పథకాన్ని రేవంత్‌రెడ్డి కూడా ఉపయోగించుకోవట్లేదు" అని జేపీ నడ్డా విమర్శించారు

## షెడ్ నుంచి కారు ఇక బయటకు రాదంతే.. బీఆర్ఎస్‌పై భట్టి కామెంట్స్



ఖమ్మం, మే 6: దేశ సంపదను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పెట్టుబడిదారులకు పంచి పెడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... నామా నాగేశ్వరరావును కేసీఆర్ ఏ పార్టీ నుంచి కేంద్ర మంత్రిని చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో ఒక్క సీట్ కూడా గెలవని బీఆర్ఎస్ నుంచి నామా ఎలా మంత్రి అవుతారని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అడ్రస్ ఉండదని.. దాని గురించి భయ పడేది లేదన్నారు. కార్ షెడ్ నుంచి ఇక బయటకు రాదని స్పష్టం చేశారు. ఓట్లు అడగడం వరకే కాదని.. కాంగ్రెస్ గతంలో ఎలా సేవ చేసిందో భవిష్యత్‌లో కూడా అలానే సేవ చేస్తామని హామీ ఇచ్చారు.

**సోయి ఉండి మాట్లాడుతున్నారా? :** రూ.1400 కోట్లతో కావల్సిన ప్రాజెక్టులను వేల కోట్లు వెచ్చించి ఒక్క చుక్క నీరు రాకుండా చేసిన చరిత్ర కేసీఆర్ ది అని విమర్శించారు. కృష్ణా జలాలతో పాటు గోదావరి జలాలు కూడా అందిస్తామన్నారు. "ధనిక రాష్ట్రాన్ని మీ చేతిలో పెడితే ఒక్క నెల కూడా మొదటి నెల జీతం ఇవ్వలేని ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం. మేము అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అందరికీ జీతాలు ఇస్తున్నాం. కాకి అరిచినట్లుగా రైతు బందు ఇవ్వలేదు అని అంటున్నారు. సోయి ఉండి మాట్లాడుతున్నారా? 65 లక్షల మందికి రైతుబంధు వేశాం.. మిగిలిన వారికి వేస్తున్నాం. అబద్దాల పునాదుల మీద బ్రతికిన కేసీఆర్ లక్ష్యం మాపై బురదజల్లడం.

కేసీఆర్ ముందు నీ బాషా మార్చుకో. కేసీఆర్ సిగ్గులేకుండా మాజీ ముఖ్యమంత్రి హెూదాలో ఏమిటా మాటలు? దద్దమ్మలు, సన్నాసులు అంటే చూస్తూ ఊరుకోం. నువ్వు చేసిన దోపిడీ సొమ్ము కక్కించి వాటితో మేము ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తాం. కోడ్ పూర్తి కాగానే ఇందిరమ్మ ఇళ్ల కు శంకుస్థాపనలు చేస్తాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.




ఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీహార్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ కవిత జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. కాగా.. ట్రయల్ కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాకుండా నేరుగా హాజరుపరచాలంటూ కవిత దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు అనుమతించినట్లు తెలుస్తోంది. రేపు(మంగళవారం) నేరుగా కోర్టు ముందుకు కవిత రానున్నట్లు సమాచారం. రేపు మధ్యాహ్నం 2 గంటలకు కవితను తీహార్ జైలు అధికారులు కోర్టు ముందు హాజరుపరుచనున్నారు. రేపటితో ఆమె జ్యుడీషియల్ కస్టడీ ముగియనున్నది. ఈ నేపథ్యంలో కోర్టు ఆమెను మళ్లీ ఈడీ కస్టడీకి ఇస్తుందా? లేక జ్యుడీషియల్ కస్టడీ విధిస్తుందా? లేక బెయిల్ మంజూరు చేస్తుందా? అనే విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే..ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈరోజు(సోమవారం) విచారించింది. ఆమె బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. ఈడీ, సీబీఐ కేసుల్లో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ రెండింటినీ కోర్టు కొట్టేసింది. దీంతో కవితకు మరో బిగ్ షాక్ తగిలినట్టయ్యింది. కాగా.. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చేయడానికి అధిష్ఠానం కవితను స్టార్ క్యాంపెయినర్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఇదే విషయాన్ని కోర్టుకు తెలియజేస్తూ.. ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సి ఉందని చెప్పినప్పటికీ రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. మరోవైపు.. మహిళగా పీఎంఎల్ఏ సెక్షన్-45 ప్రకారం బెయిల్ అర్హత ఉందన్న విషయాన్ని పిటిషన్‌లో కవిత పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ఇదివరకే న్యాయస్థానం విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఇవాళ కవిత బెయిల్‌పై రౌస్ ఎవిన్యూ స్పెషల్ కోర్టు జడ్జి కావేరి బవేజా.. తిరస్కరిస్తూ తీర్పును వెలువరించారు.




రాంచీ: సార్వత్రిక ఎన్నికలు జరుగుతోన్న తరుణంలో.. ఝార్ఖండ్‌లోని ఓ ఇంట్లో నోట్ల గుట్టలు బయటపడ్డాయి. అదంతా లెక్కల్లోకి రాని సొమ్ము అని, ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న సొమ్ము రూ.20 కోట్లపైనే ఉంటుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(%జుణ%) వర్గాలు మీడియాకు వెల్లడించాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద రాజధాని నగరం రాంచీలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఈడీ సోదాలు నిర్వహించింది. ఆ కేసులో ఝార?ండ్ గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసిన మాజీ చీఫ్ ఇంజినీర్ వీరేంద్ర రామ్ 2023లో అరెస్టయ్యారు. దర్యాప్తులో భాగంగా ఆయనకు చెందిన 10కి పైగా ప్రాంతాల్లో ప్రస్తుత సోదాలు జరిగాయి. ఈ క్రమంలోనే గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అలంఘీర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్‌కు సహాయకుడికి చెందినదిగా భావిస్తోన్న ఇంట్లో నోట్ల గుట్టలు దర్శనమిచ్చాయి. ఒక గదిలో కరెన్సీ కట్టలు పేర్చి ఉన్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై భాజపా స్పందించింది. "ఝార?ండ్‌లో అవినీతి ముగిసిపోలేదు. ప్రస్తుతం జరుగుతోన్న ఎన్నికల్లో భాగంగా సదరు వ్యక్తులు దీనిని ఉపయోగించాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి" అని కోరింది. పలు ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకలకు పాల్పడ్డారని, రూ.100 కోట్ల మేర కూడబెట్టారని వీరేంద్రపై ఆరోపణలు ఉన్నాయి. అలాగే రాష్ట్రానికి చెందిన పలువురు రాజకీయ నేతలతో ఆయన జరిపిన లావాదేవీల వివరాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను ఇదివరకే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని ఆధారంగానే సోదాలు జరిగినట్లు తెలుస్తోంది.

## ఏ అధికారంతో ఢిల్లీ పోలీసులు తెలంగాణలో దిగారు?



హైదరాబాద్, మే 6: బీజేపీపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఫైర్ అయ్యారు. ఏ అధికారంతో ఢిల్లీ పోలీసులు తెలంగాణలో దిగారు? అని ప్రశ్నించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ తడాఖా ఏంటో చూపిస్తామన్నారు. ఏ హక్కుతో గాంధీ భవన్ వచ్చి తమ వాళ్లపై కేసులు పెడుతున్నారని నిలదీశారు. బీజేపీ వాళ్ళకి దమ్ముంటే ప్రజ్వల్ రేవణ్ణను పట్టుకోవాలన్నారు. నీరవ్ మోదీ, చాక్సీ పారిపోయినట్టే రేవణ్ణ పారిపోయారని తెలిపారు. ప్రజ్వల్‌ను బలపరిస్తే తనను బలపర్చినట్టే అని మోదీ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు ఇంత చేస్తుంటే ఎన్నికల అధికారులు సైలెంట్‌గా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిజ్ భూషణ్ అన్ని అరాచకాలు చేస్తే మళ్ళీ టికెట్ ఇచ్చారన్నారు. దేశంలో ఉన్న ముస్లింలకు మోదీ ప్రధాని కాదా? అని ప్రశ్నించారు. చైనా మన గడప తొక్కి ఇంట్లో ఉంటే మోదీ మాట్లాడడం లేదన్నారు. దొంగ సర్టిఫికెట్లు పెట్టుకొని పార్లమెంట్‌కు వస్తున్నారన్నారు. జవాన్లు, రైతులు అనే రెండు పెద్ద సెక్యులర్ ఫోర్సెస్ దేశంలో ఉన్నాయన్నారు. "పెద్ద ఛాతీ ఉండడం కాదు. దానిలో గుండె, మనసు కూడా ఉండాలి" అంటూ రేణుకా చౌదరి వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణకు ఇచ్చింది 'గాడిద గుడ్డు' మాత్రమే.. బీజేపీపై పొంగులేటి ఫైర్



ఖమ్మం, మే 6: పదేళ్ల పాటు దేశాన్ని పరిపాలించిన బీజేపీ తెలంగాణకు చేసింది ఏమి లేదని.. రాష్ట్రానికి ఇచ్చింది "గాడిద గుడ్డు" మాత్రమే అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రాముల వారిని కూడా బీజేపీ రాజకీయాల్లోకి తెచ్చిందని విమర్శించారు. తలంబ్రాల పేరుతో మరోసారి అధికారంలోకి రావాలని బీజేపీ కలలుకంటోందన్నారు. 400 సీట్లు బీజేపీకి ఇస్తే రాజ్యాంగాన్ని మార్చుతుందని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చితే రిజర్వేషన్‌లను ఎత్తివేస్తుందని వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నాయకులు నోరు తెరిస్తే పచ్చి అబద్ధం చెప్తారని మంత్రి మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను ప్రలోభపెట్టి ఏడు లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. భట్టి విక్రమార్క ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల సొమ్ము లక్షన్నర కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర ఉందని విమర్శించారు. కృష్ణా నీళ్లను ఆంధ్రకు ఇచ్చింది నిజమా కాదా అని ప్రశ్నించారు. కరెంట్ ఒక్క నిమిషం కూడా ఎక్కడా పోలేదని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల తరువాత తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఉండదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## అమిత్ షా వీడియో మార్ఫింగ్‌పై హైదరాబాద్ సీపీ రియాక్షన్



హైదరాబాద్, మే 6: కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్‌పై హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. ఫేక్ వీడియోకు సంబంధించి సోషల్ మీడియాలో సర్క్యులేషన్‌పై అందిన ఫిర్యాదు నేపథ్యంలో మొత్తం 27 కేసులు నమోదు చేసినట్లు తెలపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసామని... వారు కండిషన్ బెయిల్‌పై బయటకు వచ్చినట్లు చెప్పారు. వాళ్ళ దగ్గర నుంచి సెల్ ఫోన్స్, లాప్టాప్స్ సీజ్ చేశామన్నారు. ట్విట్టర్‌కు లెటర్ పెట్టి వివరాలు తెలుసుకున్నామని చెప్పారు. మొదట ఇక్కడ నుంచే స్టార్ట్ అయినట్లు వివరాలు వచ్చాయని.. దానిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. ఇదే కేసులో ఢిల్లీ పోలీసులు తమను కలిశారని.. ఇక్కడ నమోదైన ఎఫ్ఐఆర్ డీటెయిల్స్ అడిగారన్నారు. వారికి కావలసిన వివరాలు అందించామని వెల్లడించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసుపై...** అలాగే ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఆయన మాట్లడుతూ.. కేసు దర్యాప్తులో ఉందని.. అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. ప్రభాకర్ రావుకు రెడ్ కార్నర్ నోటీస్ ఇస్తామని చెప్పారు. అందుకు సంబంధించి లీగల్ ప్రొసీడింగ్స్ ఫాలో అవుతున్నామన్నారు. ఈ కేసులో నిందితులు ఎన్ని ఆధారాలు ధ్వంసం చేసినా.. తాము కష్టపడి ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. ఈ కేసులో ఎవరి ప్రమేయం ఉన్నా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు అధికారులు, నాయకులు చట్టానికి ఎవరైనా సమానమే అని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## కల్వకుర్తి ఎమ్మెల్యే కారును ఢీ కొట్టిన బైకు.. ఇద్దరి మృతి

రంగారెడ్డి: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కారు ప్రమాదం ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తలకొండపల్లి మండలం వెల్జాల్‌లో ఎన్నికల ప్రచారం ముగించుకొని వెళ్తుండగా.. గ్రామ శివారులో ఎమ్మెల్యే కారును ఓ బైకు ఢీ కొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. నరేశ్ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి



చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరశురామ్ అనే మరో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతులను వెంకటాపుర్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి కారు ధ్వంసమైంది. ఎయిర్ బెలూన్‌లు సకాలంలో తెరుచుకోవడంతో ఎమ్మెల్యే స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## టెలీ కాలర్‌పై ఎమ్మెల్యే రాజాసింగ్ ఫైర్

హైదరాబాద్, మే 06: టెలీ కాలర్‌పై గోషా మహల్ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు రాజా సింగ్ మండిపడ్డారు. బైక్ కొనుగోలు కోసం లోన్ తీసుకున్నారు.. ఈ నేపథ్యంలో బ్యాంక్ లోన్ చెల్లించాలంటూ ఎమ్మెల్యే రాజా సింగ్‌కు మంగళవారం ఓ ప్రైవేట్ బ్యాంక్ తరఫున టెలీ కాలర్ ఫోన్ చేశారు. ఎవరి పడితే వారు నెంబర్ ఇస్తే.. ఇలా కాల్ చేస్తారా? అంటూ సదరు టెలీ కాలర్‌పై ఎమ్మెల్యే రాజసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం టెలీ కాలర్‌తో ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. నేను ఇర్ఫాన్ కాదమ్మ.. ఎమ్మెల్యే రాజసింగ్‌నని ఆమెకు స్పష్టం చేశారు. అయితే షేక్ మహమ్మద్ పేరు మీద వాహనం తీసుకున్నారని... ఆ క్రమంలో ఇర్ఫాన్ పేరుతో మీ నంబర్ ఇచ్చారని ఎమ్మెల్యే రాజా సింగ్‌కు టెలీకాలర్ వివరించింది. బైక్ లోన్ తీసుకున్న వాళ్లు మీ నెంబర్ ఇచ్చారని.. ఈ నేపథ్యంలో మీకు కాల్ చేశానని టెలీ కాలర్ ఎమ్మెల్యే రాజా సింగ్‌కు తెలిపింది. అయితే తన గురించి.. గూగల్, యూ ట్యూబ్‌లలో సెర్చ్ చేసి తెలుసుకోవాలంటూ.. టెలీ కాలర్‌కు ఎమ్మెల్యే రాజసింగ్ సూచించారు. మరోవైపు బైక్ లోన్ తీసుకొన్న వ్యక్తులు.. ఎమ్మెల్యే రాజాసింగ్ ఫోన్ నెంబర్ ఇచ్చినట్లు సదరు బ్యాంక్ సిబ్బంది గుర్తించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com